# ప్రభాత సూర్య

PRABHATA SURYA

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

వేల రూ.5/ - పేజీలు : 8 శనివారం 6 సెప్టెంబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## ఓలా ఎలక్ట్రిక్‌లో సాఫ్ట్‌బ్యాంక్ వాటా తగ్గింపు

ద్విచక్ర విద్యుత్ వాహనాల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్‌లో జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ 2.15 శాతం వాటాలను విక్రయించింది. దీంతో సాఫ్ట్‌బ్యాంక్ తన హోల్డింగ్ వాటాను 17.83 శాతం నుంచి 15.68 శాతానికి కుదించుకుందని ఓలా ఎలక్ట్రిక్ గురువారం రెగ్యులేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. జూలై 15 నుండి సెప్టెంబర్ 2 మధ్య జరిగిన వరుస విక్రయాల్లో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్‌లోని కొన్ని ఈక్విటీ షేర్లను విక్రయించిందని పేర్కొంది. 2025 జూన్ 30 నాటికి ఓలా ఎలక్ట్రిక్‌లో సాఫ్ట్ బ్యాంక్ 17.83 కోట్ల షేర్లను కలిగి ఉంది. ఇది 78.65 కోట్ల ఈక్విటీ షేర్లలో 17.83 శాతం వాటాకు సమానం.






# ధరణి దోపిడీ కోసమే

- గత ప్రభుత్వ పాలకుల భూదోపిడీ విధానాన్ని ప్రజలకు వివరించండి
- వీఆర్వోలు, వీఆర్ఏలులేని లోటు 20 నెలల పాలనలో కనిపించింది
- ధరణితో పట్టిన దరిద్రాన్ని భూభారతితో వదిలించే ప్రయత్నం చేస్తున్నాం
- ఇది ఉద్యోగం కాదు.. భావోద్వేగం.. సమయస్ఫూర్తి, సంయమనంతో మెలగండి
- గ్రామ పాలనాధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం... నియామక పత్రాలు అందజేత
- ప్రభుత్వానికి మచ్చ రాకుండా పనిచేయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి సూచన



**సూర్య హైదరాబాద్**

'రెవెన్యూ శాఖ సిబ్బందిని దొంగలుగా గత ప్రభుత్వం ముద్ర వేసింది. రాష్ట్రాన్ని దోచుకున్న వారిలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఇది మీ ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్య. ఇది ఉద్యోగం కాదు.. భావోద్వేగం. జాగ్రత్తగా ఉండండి. సమయస్ఫూర్తి, సంయమనంతో వ్యవహరించండి. మీపై వేసిన ముద్రను తొలగించుకోవడమే కాకుండా నాటి పాలకులు దోపిడీకి పాల్పడిన విధానాన్ని ప్రజలకు వివరించే విధంగా ప్రతిజ్ఞ చేయండి'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పరిపాలన చేయలేనంటూ తనపై చేస్తున్న ఆరోపణలు, పాలనలో దోపిడీకి పాల్పడ్డారని రెవెన్యూ సిబ్బందిపై వేసిన ముద్ర తప్పని నిరూపించాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణలో భాగంగా కొత్తగా నియమితులైన గ్రామ పాలనాధికారుల (జీపీవో)కు శుక్రవారం హైదరాబాద్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో భూమికి, ప్రజలకు ఉన్న అవినాభావ సంబంధం తల్లీబిడ్డ బంధం లాంటిదన్నారు. నాటి పాలకులు ధన, భూదాహంతో తెలంగాణ భూభాగాన్ని - మిగతా2లో



## చైనాతో సరిహద్దు వివాదమే అతిపెద్ద సవాల్

- పాకిస్తాన్ తెరచాటు యుద్ధం కూడా సమస్యాత్మకమే
- పొరుగు దేశాల్లోఅస్థిరత మనకు ఆందోళనకరం
- సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యలు



## సైనిక శక్తి బలోపేతానికి మెగా డిఫెన్స్ ప్లాన్

- అణుశక్తి యుద్ధనౌకలు, లేజర్ ఆయుధాలు
- సాయుధ దళాలకు హైపర్ సానిక్ క్షిపణులు
- 15 ఏళ్లకు రోడ్ మ్యాప్ సిద్ధం




## స్మార్ట్ టీచర్ల అవసరమే ఎక్కువ

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలతో రాష్ట్రపతి ముర్ము



## విద్యా రంగాన్ని సంస్కరిద్దాం

- ప్రైవేటుకు మించి ప్రభుత్వ స్కూళ్లు రాణించాలి
- ప్రక్షాళన కోసమే విద్యాశాఖను నేను తీసుకున్నా
- తెలంగాణకు ప్రత్యేక విద్యా విధానం కోసం కమిటీ వేశాం
- టీచర్లు బాగా పనిచేస్తే నేను మళ్లీ సీఎం అవుతా
- విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు
- గురుపూజోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

# భూ చిక్కులకు చెక్

- రాష్ట్రవ్యాప్తంగా భూసమస్యలపై లక్షల్లో దరఖాస్తులు
- సాదాబైనామా, అసైన్డ్ భూములపైనే అత్యధికం
- ఇన్నాళ్లూ క్షేత్రస్థాయి యంత్రాంగం లేక కదలని ప్రక్రియ
- జీపీఓలు, సర్వేయర్ల నియామకంతో పరిశీలనకు మార్గం సుగమం




**సూర్య హైదరాబాద్**

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలకు భూభారతి చట్టంతో పరిష్కారం లభించనుందని ప్రభుత్వం చెబుతోంది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌లోని లోపాలను సరిదిద్దుతూ ప్రస్తుత భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా జూన్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు, సమావేశాల్లో లక్షలాదిగా దరఖాస్తులు వచ్చాయి. సర్వే నంబర్లు, ఇంటి పేరు, భూ యజమాని పేరు తప్పుగా ఉండటం, విస్తీర్ణం తక్కువగా నమోదవడం, నిషేధిత భూముల జాబితాలో పట్టా భూమి సర్వే నంబర్లు రావడం, సర్వే నంబర్లు మిస్ కావడం, సాదాబైనా మా, మ్యుటేషన్, అసైన్డ్ ల్యాండ్ పట్టా, - మిగతా2లో

# వయో వృద్ధ భారతం

- దేశంలో తగ్గుతున్న జననాలు.. పెరుగుతున్న వృద్ధుల జనాభా
- జనాభాలో 10 శాతం వయోధికులే
- జనాభా సంక్షోభంతో నిపుణుల ఆందోళన






## డేంజరస్ చైనాతో..

# దోస్తీయా?

### భారత్, రష్యాపై ట్రంప్ రుసరుసలు

- డ్రాగన్ దుష్ట కౌగిలికి దాసోహం అయ్యాయంటూ భగ్గు... కొత్త పొత్తులు ఎంతకాలమో చూద్దామంటూ సవాళ్లు
- ఎస్‌సీఓ ఫొటో షేర్‌చేస్తూ నిష్ఠూరాలు.. ట్రంప్‌నకు దీటుగా బదులిస్తున్న రష్యా, చైనా
- విక్టరీ పరేడ్ వేదికగా చైనా బలప్రదర్శన.. ఉక్రెయిన్‌లోకి వచ్చే ఏ దేశమైనా మా శత్రువే: పుతిన్

## రేవంత్ నాయకత్వంలోనే

# 2028ఎన్నికలకు..

- కాళేశ్వరం అవినీతిపై సీబీఐ కంటే మరో మార్గం లేదు
- మీడియాతో మహేశ్‌కుమార్‌గౌడ్
- పీసీసీ అధ్యక్షుడిగా ఏడాది పూర్తి

**సూర్య హైదరాబాద్**

'వచ్చే 2028 అసెంబ్లీ ఎన్నికల్లోనూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే పోటీ చేస్తాం. ఎన్నికల అనంతరం ఎమ్మెల్యేలంతా కలిసి కొత్త సీఎంను ఎన్నుకోవడం కాంగ్రెస్ విధానం' అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. రేవంత్‌కు తనకు మధ్య మంచి అవగాహన(కెమిస్ట్రీ) ఉందని.. సీఎం, మంత్రులు తనకు బాగా సహకరిస్తున్నారని ఆయన వివరించారు. పీసీసీ అధ్యక్షుడిగా ఏడాది పదవీకాలం పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన శుక్రవారం ఇక్కడ అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఐదేళ్లూ కొనసాగుతారు. భవిష్యత్‌లో వెనుకబడిన వర్గాల(బీసీ) నేతను తెలంగాణకు సీఎం చేయడం కాంగ్రెస్‌తోనే - మిగతా2లో



# విద్యా రంగాన్ని సంస్కరిద్దాం

హైదరాబాద్

విద్యారంగాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉందని, దీని కోసం ప్రతి ఒక్కరూ కలిసి నడవాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రానికి సరికొత్త విద్యావిధానం రూపొందించేందుకే ప్రత్యేక అధ్యయన కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ రంగానికి మించిన నాణ్యతతో ప్రభుత్వ పాఠశాలలు విద్యను అందించాలని కోరారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలకోపన్యాసం చేశారు. గత పదేళ్లలో విద్యాశాఖ నిర్వీర్యమైందని, చారిత్రక ప్రాధాన్యత గల ఉస్మానియా యూనివర్సిటీ మూతపడే దశకు చేరి ందన్నారు. విద్యా శాఖను సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యా విధానంలో సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షించాలన్న ఉద్దేశంతోనే దానిని తన వద్ద ఉంచుకున్నానని సీఎం తెలిపారు. దీనిపై కొంతమంది చేస్తున్న విమర్శలు అర్థం లేనివని కొట్టిపారేశారు. పదేళ్లుగా ఈ శాఖ అస్తవ్యస్తమైందని విమర్శించారు. ప్రొఫెసర్లను నియమించకుండా యూనివర్సిటీలను నీరుగార్చారని ఆరో పించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే టీచర్ల బదిలీలు, 55 రోజుల్లోనే 11 వేల మంది టీచర్ల నియామకాలు చేపట్టామని చెప్పారు.



**టీచర్లు బాగా పనిచేస్తే మేము మళ్లీ గెలుస్తాం**

తెలంగాణ ఉద్యమాన్ని పల్లెలకు తీసుకెళ్లిన ఘనత టీచర్లదేనని సీఎం అన్నారు. 'ఢిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి ముఖ్యమంత్రి కావడానికి విద్యాభివృద్ధే కారణం. నాలోనూ ఆ స్వార్థం ఉంది. టీచర్లు బాగా పనిచేస్తేనే నేను రెండోసారి సీఎం అవుతాను. ఉపాధ్యాయ సంఘాలు ఎప్పుడొచ్చినా సమస్యలు విని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నా. ప్రైవేట్ కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువ విద్యావంతులు, సామాజిక బాధ్యత తెలిసినవారు. టీచర్లకు జీతాలిచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదు. మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. పాఠశాలల నిర్వహణకు ఏటా రూ.130 కోట్లు మంజూరు చేస్తున్నాం'అని తెలిపారు.

**విద్యార్థులతో కలిసి భోజనం చేయండి**

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కొన్నిసార్లు విషపూరితం కావటం దురదృష్టకరమని సీఎం అన్నారు. పాఠశాలల్లో ముధ్యాహ్న భోజన సమయంలో పిల్లలతో కలసి ఉపాధ్యాయులు భోజనం చేయాలని కోరారు. అప్పుడే తప్పులు జరగకుండా ఉంటాయని అభిప్రాయపడ్డారు. అప్పుడప్పుడు తాను కూడా విద్యార్థులతో కులిసి భోజనం చేస్తానని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల చేరికలు పెరిగాయని చెప్పారు. ప్రైవేటు, కార్పొరేట్ కన్నా మంచి విద్యను అందిస్తామని టీచర్లు ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు.

**బలమైన పునాది అవసరం**

విద్యకు బలమైన పునాది అవసరమని సీఎం అన్నారు. 'విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవడం కీలకం. దీని దృష్టిలో ఉంచుకునే వరల్డ్ బెస్ట్ మోడల్‌గా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నాం. నిరుద్యోగ యువతకు నైపుణ్యాన్ని అందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. 65 ఐటీఐలను టాటా కంపెనీతో కలిసి జాయింట్ వెంచర్‌గా ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేశాం. దేశ ప్రతిష్టను పెంచేలా తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నాం'అని వివరించారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ ఫోర్స్ తెస్తున్నామని ప్రకటించారు. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా గురుపూజోత్సవ విశిష్టతను, గురువులకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, ఎమ్మెల్సీలు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, ఏవీఎన్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య, సాంకేతిక విద్య కార్యదర్శి దేవసేన తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అవార్డులు అందించారు. అంతకుముందు విద్యార్థులు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు.

# ధరణి దోపిడీ కోసమే

-మొదటిపేజీ తరువాయి

చెరబట్టాలనే ఆలోచనతో ధరణి అనే భూతాన్ని తెచ్చారని రేవంత్ దుయ్యబట్టారు. ఆ భూతం ద్వారా కొల్లగొట్టే భూముల లెక్కలు ప్రజలకు తెలియకూడదనే దురాలోచనతోనే వీఆర్వో, వీఆర్ఏలను బలి ఇచ్చి ఆ వ్యవస్థలను తొలగించారని ఆరోపించారు. ప్రజల ముందు రెవెన్యూ సిబ్బందిని దోషులుగా నిలబెట్టి నిస్సహాయులను చేశారని విమర్శించారు. దోపిడీదారులంటూ పచ్చపొట్టు లాంటి ముద్ర వీఆర్వోలు, వీఆర్ఏలపై వేసిన నాటి పాలకులు కాళేశ్వరం కూలిపోయిందని ఆ పార్టీని రద్దు చేస్తారా? అని ప్రశ్నించారు. వీఆర్వోలు, వీఆర్ఏల తరహాలోనే ఆ పార్టీ నేతలను ఉద్యోగాల నుంచి తొలగిస్తారా? అని నిలదీశారు. రూ. లక్ష కోట్లు ఖర్చుపెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లలోనే కూలిపోయిన విషయాన్ని తాను కాదని.. గ్రామాల్లోకి ఇప్పుడు వెళ్తున్న గ్రామ పాలనాధికారులే ప్రజలకు చెబుతారన్నారు.



**నాటి పాలకులు కొల్లగొట్టిన భూముల లెక్కలు తీయండి**

గతంలో వీఆర్వో వ్యవస్థ రద్దు కారణంగా పేదలకు న్యాయం జరగలేదని.. వీఆర్వోలు, వీఆర్ఏలు లేని లోటు తమ 20 నెలల పాలనలో కనిపించిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు గ్రామ పాలనాధికారుల రూపంలో రెవెన్యూ సిబ్బంది పేదలకు సేవ చేస్తారని.. రైతుల సమస్యలు పరిష్కరించే బాధ్యత తీసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు. నాడు ధరణితో పట్టిన దరిద్రాన్ని భూభారతి చట్టంతో వదిలించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. 'నాటి పాలకులు అంటించిన వైరస్ ధరణి. ఆ వైరస్‌తో కొల్లగొట్టిన భూముల లెక్కలు తొందర్లోనే గ్రామ పాలనాధికారులు బయటకు తీయాలి. ఈ వ్యవస్థను పనిచేయించే బాధ్యత మంత్రి పొంగులేటిదే. మీపై, మంత్రిపై నాకు నమ్మకం ఉంది'అని సీఎం రేవంత్ అన్నారు.

**భూసమస్యలన్నింటినీ పరిష్కరించండి**

భూభారతి చట్టం ఫలాలను పేదలకు అందించాలనే ఉద్దేశంతోనే గ్రామ పాలనాధికారుల నియామకం చేపట్టామని.. సాధారణ భూసమస్యలతోపాటు సాదాబైనామాల సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. నిజాం, రజాకార్లు, భూస్వాములు, జాగీర్దార్లు, జమీందార్లకు పట్టిన గతే ధరణి ముసుగులో భూదోపిడీకి పాల్పడాలనుకునే వారికి కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో గుణపాఠం రూపంలో పట్టిందని రేవంత్ పేర్కొన్నారు. అందుకే ప్రజాపాలన వచ్చిందని.. ఇందిరమ్మ రాజ్యంలో మళ్లీ కొలువుల జాతర మొదలైందన్నారు. 'ఉద్యోగం ఒకటి కాకపోతే ఇంకొకటి వస్తుంది. ఏదో పని దొరకుతుంది. కానీ మీపై పడిన మచ్చను చెరిపేసుకొనే అవకాశం అరుదుగా వస్తుంది. రెవెన్యూ శాఖపై పడిన మరకను చెరిపేసే బాధ్యత మీ 5 వేల మందిపై ఉంది. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. భుజం తట్టి ప్రోత్సహిస్తుంది. మీరిచ్చిన సూచనలను తీసుకుంటుంది'అని సీఎం రేవంత్ అన్నారు. కాగా, క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించినందుకు రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు వి.లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, రమేశ్‌పాక, బాణాల రాంరెడ్డి, వంగ రవీందర్‌రెడ్డి, కె. గౌతమ్‌కుమార్, గోల్కొండ సతీశ్ తదితరులు సీఎం రేవంత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఉగాది నాటికి 7 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు...**

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా నియమితులైన జీపీవోలు ప్రభుత్వానికి చిన్న మచ్చ కూడా రాకుండా పనిచేయాలని కోరారు. గత సర్కారు ధరణి చట్టానికి మూడేళ్లయినా నియమ, నిబంధనలు రూపొందించలేదని.. భూభారతి చట్టానికి మాత్రం 90%-%92 రోజుల్లోనే పకడ్బందీగా నియమ, నిబంధనలు రూపొందించి ప్రజలకు అంకితమిచ్చామని ఆయన చెప్పారు. అందరికీ రోల్‌మోడల్‌గా ఉండేలా చట్టం చేసేందుకు సీఎంను చాలాసార్లు విసిగించామని.. ఆయన కూడా 36 గంటలు నిద్రపోలేదని గుర్తుచేసుకున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి పెండింగ్‌లో పెట్టిన సాదాబైనామాల దరఖాస్తులు పరిష్కరిస్తున్నామని.. నాడు రద్దయిన క్షేత్రస్థాయి రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో రాబోయే ఉగాది నాటికి 7 వేల మంది లైసెన్సుడ్ సర్వేయర్లను నియమిస్తామని వెల్లడించారు. ప్రతి డిసెంబర్ 31న జమాబందీ నిర్వహిస్తామని.. భూభారతి చట్టం చుట్టంలాగా రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కొత్త జీపీవోలతో మంత్రి పొంగులేటి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కవిత ఆరోపణలపై స్పందించిన హరీష్‌రావు

హైదరాబాద్

బీఆర్ఎస్ మాజీ నేత కల్వకుంట్ల కవిత ఆరోపణలపై మాజీ మంత్రి హరీష్ రావు స్పందించారు. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం అని, అందులో దాపరికాలు ఏం లేవని అన్నారాయన. విదేశీ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన ఆయనకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మీడియా నుంచి ఈ వ్యవహారంపై ప్రశ్న ఎదురైంది. దానికి ఆయన స్పందిస్తూ.. నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ వ్యాఖ్యలనే కవిత ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో నా నిబద్ధత అందరికీ తెలుసు అని అన్నారాయన. ఇదిలా ఉంటే.. హరీష్ రావు, సంతోష్ రావుల వల్లే తాను పార్టీ నుంచి సస్పెండ్ అయ్యానని కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఈ క్రమంలో హరీష్‌రావుకు బంగారు తెలంగాణపై చిత్తశుద్ధి లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారామె. హరీష్‌రావు మొదటి



నుంచి పార్టీలో ఏం లేరని, బీఆర్ఎస్‌పై ఎప్పటి నుంచో హరీష్‌రావు కుట్రలు చేస్తున్నారని, కాంగ్రెస్..బీజేపీలతో టచ్‌లో ఉంటూ కల్వకుంట్ల కుటుంబాన్ని చీల్చి పార్టీని హస్తగతం చేసుకోవాలని చూస్తున్నారని, స్వలబ్ధి కోసమే తనను బయటకు పంపించేశారని ఆరోపించారామె. ఆరడుగుల బుల్లెట్టుగా బీఆర్ఎస్ అభివర్ణిస్తున్న హరీష్‌రావు తనకు గాయం చేశారని పేర్కొంటూ.. ఈ క్రమంలో హరీషన్నతో జాగ్రత్త అంటూ కేసీఆర్, కేటీఆర్‌లకు సూచిస్తూ పార్టీకి, తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారామె.

## రేవంత్ నాయకత్వంలోనే 2028ఎన్నికలకు..

-మొదటిపేజీ తరువాయి

సాధ్యం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని అనుకుంటున్నాం.

**బీసీలకు రిజర్వేషన్లు అందకుండా చేసింది కిషన్‌రెడ్డి, సంజయ్‌లే...**

బీసీ బిడ్డలకు నోటిదాకా వచ్చిన రిజర్వేషన్ల ముద్దను తినకుండా చేసింది భాజపాకు చెందిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లే. పది రోజుల్లో పార్టీ కమిటీల నియామకాలను పూర్తిచేస్తాం. వచ్చే నెలలో నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తాం. డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఒక విధానాన్ని అనుసరిస్తున్నందున కొంత సమయం పడుతుంది. అక్టోబర్లో పార్టీ సభ్యత్వ నమోదు, కార్యకర్తలకు జీవితబీమా కార్యక్రమాలను మొదలుపెడతాం. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఎంపికలో డీసీసీల పాత్ర పెంచబోతున్నాం. గాంధీభవన్‌లో ప్రజలతో మంత్రుల ముఖాముఖి కార్యక్రమానికి మంచిపేరు వస్తున్నందున కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇతర రాష్ట్రాల్లో మొదలు పెడుతున్నాయి. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే నేతలపై నిక్కచ్చిగా వ్యవహరిస్తాం. కాంగ్రెస్‌లో సడన్ బ్రేకులు కూడా ఉంటాయి. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి విషయంలో కొంత గందరగోళం ఉంది. ఉన్నది ఉన్నట్టు మాట్లాడడం కోమటిరెడ్డి సోదరులకు అలవాటు. బీసీలు కులాన్ని పక్కన పెట్టి కాంగ్రెస్ కోసం పనిచేయాలి" అని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు.

**రాష్ట్ర సంస్థలతో విచారణ చేయిస్తే బద్నాం చేసేవారు**

సీబీఐలో అనేక లొసుగులు ఉన్నా కాళేశ్వరం అవినీతిపై విచారణకు దానికంటే మరో మార్గం లేదు. రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయిస్తే భారత రాష్ట్ర సమితి నేతలు కాంగ్రెస్‌ను బద్నాం చేసేవారు. కవిత మాటలు చూస్తుంటే కేసీఆర్ కుటుంబ సభ్యులు కావాలనే డ్రామా చేస్తున్నారనిపిస్తోంది. కాళేశ్వరంపై సీబీఐ విచారణను పక్కదారి పట్టించేందుకు ఇదంతా చేస్తున్నట్లు అనుమానంగా ఉంది. కాళేశ్వరంలో హరీశ్‌రావు, సంతోష్‌రావు ఎలా దోచుకున్నారో చెప్పి కవిత మంచిపని చేశారు. అవినీతి జరిగిందని కాంగ్రెస్ చెప్పేదంతా నిజమేనని భారత రాష్ట్ర సమితిలో పనిచేసిన కవిత ప్రజలకు వివరించినట్లయింది. అయినా అవినీతి మరకలు ఉన్న ఆమెను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోం. పీసీసీ అధ్యక్షుడిగా నేను చెప్పేది ఏఐసీసీ నిర్ణయం ప్రకారమే ఉంటుంది. ధనం, అధికారం కోసమే కవిత-కేటీఆర్ పంచాయితీ జరుగుతోంది. అవినీతి జరిగిందని ఆమెకు ఎప్పుడో తెలుసు కాబట్టి అప్పుడే మాట్లాడితే ఆమెకు మేం సెల్యూట్ చేసేవాళ్లం.

## భూ చిక్కులకు చెక్

-మొదటిపేజీ తరువాయి

వారసత్వ పట్టా వంటివి దాదాపు 20 కేటగిరీల్లో దరఖాస్తులొచ్చాయి. అత్యధికంగా సాదాబైనామా, అసైన్డ్ భూముల దరఖాస్తులే ప్రభుత్వానికి వచ్చాయి. సాదాబైనామాలపై గతంలో విధించిన స్టేను హైకోర్టు ఇటీవల తొలగించడంతో తెల్లకాగితాలపై భూముల క్రయవిక్రయాలు చేసిన రైతులకు ఊరట లభించనుంది. 1969 నుంచి పేదలకు అసైన్డ్ భూములను కేటాయిస్తుండగా లబ్ధిదారులు విక్రయించడానికి వీల్లేకుండా 1977లో అప్ప టి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం పీఓటీ చట్టాన్ని తీసుకొచ్చింది. కానీ చాలామందికి అవగాహన లేక భూములు చేతులు మారాయి. ఈ సమస్య పరిష్కారానికి కూడా భూభారతి చట్టం దారి చూపనుంది. ఇప్పటికే అమ్మకం, కొనుగోలుదారులకు నోటీసులు జారీ చేయగా త్వరలోనే జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి సర్వే నిర్వహించనున్నారు.

**రెవెన్యూ వ్యవస్థకు జవసత్వాలు**

భూముల సమస్యల పరిష్కారానికి ఉన్న చట్టాల అమల్లో క్షేత్రస్థాయి సిబ్బంది అవసరం. గతంలో మండలానికి ఒకే ఒక్క సర్వేయర్, వీఆర్ఏ, వీఆర్వో దరఖాస్తులు పరిశీలించేవారు. 2020లో అప్పటి ప్రభుత్వం వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో దరఖాస్తుల పరిష్కారం క్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా గతంలో ఉద్వాసనకు గురైన 5,101 మంది వీఆర్ఏ, వీఆర్ఓలను జీపీఓ (గ్రామ పాలనాధికారులు)లుగా నియమించింది. అలాగే 7 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేసింది.

**మరికొంత సమయం..**

భూభారతి ద్వారా భవిష్యత్తులో భూవివాదాలు, ఘర్షణలకు తావులేకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. సాదాబైనామాలో తెల్లకాగితాలపై క్రయవిక్రయాలు జరుగుతుండగా భూమిపై ఒకరు, రికార్డుల్లో మరొకరు యజమానిగా ఉంటున్నారు. భూమి మీద ఉన్న వ్యక్తి క్రమబద్ధీకరించాలని భూభారతిలో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా పరిష్కారానికి కొంత సమయం పట్టనుంది. అలాగే అసైన్డ్ భూముల విషయంలోనూ విక్రయదారు, కొనుగోలుదారులను పిలిపించి ప్రభుత్వం విచారణ చేపట్టనుంది.

## హాజరు కాలేదు.. అనుమతీ తీసుకోలేదు



హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ '22ఎ' కింద ఉన్న నిషేధిత భూముల వివాదానికి సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని.. లేదంటే వ్యక్తిగతంగా హాజరుకావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇచ్చిన ఆదేశాలు అమలు కాకపోవడంపై ఇటీవల హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. తాము ఇచ్చిన గడువులోగా అఫిడవిట్ దాఖలు చేయలేదని.. అలాంటప్పుడు హాజరుకావాల్సి ఉండగా.. హాజరూ కాలేదంది. హాజరు మినహాయింపునకు అనుమతి కోరుతూ ఎలాంటి మెమో దాఖలు చేయకపోవడంపై అసహనం వ్యక్తంచేసింది. ఈ చర్యను సీఎస్ నుంచి ఊహించలేదని, ఇది ఆయన కార్యాలయ స్థాయిని తగ్గించేలా ఉందని ఘాటుగా వ్యాఖ్యానించింది. చివరి అవకాశంగా ఒక వారం గడువు ఇస్తున్నామని.. ఈలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని, లేనిపక్షంలో హాజరు కావాల్సిందేనని ఉత్తర్వులు జారీ చేసింది. ఇలాగే ఉదాసీనంగా ఉంటే తదుపరి విచారణలో కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించింది. రిజిస్ట్రేషన్లకు వెళ్లినప్పుడు భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయంటూ సబ్‌రిజిస్ట్రార్లు తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ఇటీవల మరోసారి విచారణ చేపట్టారు. ఆ భూముల వివరాలు 9 వారాల్లో సబ్ రిజిస్ట్రార్లకు అందేలా చర్యలు తీసుకోవాలని.. సంబంధిత ప్రక్రియపై 10 రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని, లేదంటే హాజరు కావాలంటూ ఇచ్చిన గత ఆదేశాలు అమలు చేయకపోవడంపై న్యాయమూర్తి ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు. ప్రభుత్వ న్యాయవాది కాట్రం మురళీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ దీనికి సంబంధించి వివరాల సేకరణలో ప్రభుత్వం ఉందని తెలిపారు. అన్ని వివరాలు సేకరించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని.. కొంత గడువు కావాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. నిషేధిత భూముల జాబితా వివరాలను సబ్‌రిజిస్ట్రార్లకు అందజేసే ప్రక్రియపై చేపట్టిన చర్యలను వివరిస్తూ సీఎస్ అఫిడవిట్ దాఖలు చేయాలని, లేనిపక్షంలో వ్యక్తిగతంగా హాజరుకావాల్సిందేనని తేల్చిచెప్పారు. ఉదాసీనంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమంటూ విచారణను ఈ నెల 10కి వాయిదా వేశారు.

# డేంజరస్ చైనాతో.. దోస్తీయా?

న్యూఢిల్లీ


చైనాకు రష్యా, భారత్ సన్నిహితం కావటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భగ్గుమంటున్నారు. దుష్ట చైనాతో చేతులు కలుపుతారా? అంటూ రుసరుసలాడుతున్నారు. చైనా అంధకారంలోకి మీరూ పడిపోతున్నారంటూ శాపనార్థాలు పెడుతున్నారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సమావేశంలో మోదీ, పుతిన్, జిన్‌పింగ్ కలిసి ఉన్న ఫొటోను సోషల్‌మీడియాలో షేర్‌చేస్తూ అక్కసు వెళ్లగక్కారు. మరోవైపు అమెరికాకు దీటుగా చైనా తన సైనిక, ఆయుధ శక్తిని ప్రదర్శిస్తుంటే.. ఉక్రెయిన్‌లోకి ఏ ఇతర దేశం బలగాలు వచ్చినా దాడి చేస్తామని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులు.. ధీటుగా చైనా, రష్యా సవాళ్లతో ప్రపంచం ఉద్రిక్తంగా మారుతోంది. మధ్యేమార్గం అనేది మాయమై.. ప్రపంచం రెండు ముక్కలుగా చీలుతోంది. అమెరికా బెదిరింపులకు గురైనవారిని తాను కాపాడుతాను అన్నట్లుగా చైనా తన సైనిక బలాన్ని ప్రదర్శించటంతో రెండు ప్రపంచ మహాశక్తులు యుద్ధానికి ఎదురెదురుగా నిలబడినట్లయ్యింది. ఈ అసాధారణ పరిణామానికి ఈసారి భారత్ కేంద్ర బింధువుగా, బాధితురాలిగా మారుతున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల చైనాలో నిర్వహించిన షాంఘై సహకార సమాఖ్య (ఎస్‌సీఓ) సమావేశంలో కనిపించిన ఒకే ఒక్క దృశ్యం ఇప్పుడు ప్రపంచ దృక్పథాన్ని మార్చివేస్తోంది.

**ట్రంప్ నిష్టూరాలు**

ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాను లొంగదీసుకునేందుకు భారత్‌ను వాడుకోవాలని భంగపడి.. సుంకాల పేరుతో బెదిరింపులకు దిగిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఎస్‌సీఓ సమావేశంపై భయపడుతూనే నిష్టూరాలు ఆడారు. ఆ సమావేశంలో భారత ప్రధాని నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ నవ్వుతూ మాట్లాడుకుంటున్న ఫొటోను తన సొంత సోషల్‌మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్‌లో షేర్ చేస్తూ భారత్, రష్యాను తాము కోల్పోయామని రాసుకొచ్చారు. 'చూడబోతే మేము అంధకార అగాధమైన చైనాకు భారత్, రష్యాలను కోల్పోయినట్లు కనిపిస్తోంది. వారి భవిష్యత్తు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నా'అని వ్యంగ్యంగా రాసుకొచ్చారు. దుష్ట చైనాతో చేతులు కలిపితే అంధకారంలోకి వెళ్లినట్లేనని భావాత్మకంగా చెప్పారు. అదే సమయంలో తన దారికి తెచ్చుకోవాలనుకున్న రష్యా, భారత్‌లు తన ప్రత్యర్థి అయిన చైనా వైపు వెళ్లిపోయాయన్న భయం కూడా ఆయన మాటల్లో కనిపించిందని నిపుణులు పేర్కొంటున్నారు.

**యుద్ధమా? శాంతా?**






ప్రపంచంపై అమెరికా ఆధిపత్యానికి ముగింపు పలికే సుముహూర్తం ఇదేనని చైనా భావిస్తోంది. ఈ నెల 3న ఆ దేశం విక్టరీ పరేడ్‌లో చేసిన బలప్రదర్శన ప్రపంచానికి ఈ అంశంలో స్పష్టమైన సందేశం ఇచ్చింది. అమెరికా పేరు ప్రస్తావించకుండానే 'శాంతియా? యుద్ధమా?'తేల్చుకోవాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్పష్టమైన హెచ్చరిక జారీచేశారు. ఆ సమావేశానికి అమెరికా ఆగర్భ శత్రువులైన ఉత్తరకొరియా, ఇరాన్ దేశాల అధినేతలు కూడా హాజరయ్యారు. అమెరికా బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, కాపాడేందుకు తాను ఉన్నానన్న భావన జిన్‌పింగ్ ప్రకటనలో కనిపించిందని నిపుణులు పేర్కొంటున్నారు. జిన్‌పింగ్ ప్రకటనకు కొనసాగింపు అన్నట్లుగా రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా అలాంటి ప్రకటనే చేశారు. ఉక్రెయిన్‌తో ఏ దేశం తన బలగాలను మోహరించినా వాటిపై దాడులు చేస్తామని శుక్రవారం హెచ్చరిక జారీచేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ గురువారం యూరోపియన్ దేశాధినేతలతో సమావేశమై సైనిక మద్దతు కోరిన నేపథ్యంలో పుతిన్ ప్రకటన సంచలనంగా మారింది. ఎందుకంటే అమెరికాతోపాటు దాదాపు యూరప్ దేశాలున్నీ నాటోలో భాగస్వాములుగా ఉన్నాయి. ఒకవేళ నాటో బలగాలు ఉక్రెయిన్‌లోని అడుగుపెడితే.. వాటితో ముఖాముఖి యుద్ధానికి సిద్ధమని పుతిన్ తేల్చి చెప్పారు. దీంతో ప్రాంతీయ ఘర్షణలన్నీ కలిసి నిర్ణయాత్మక ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయా? అన్న ఆందోళన ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది.

**భారతే కీలకం**

దశాబ్దాలుగా మధ్యేవాద విధానంతో ప్రపంచ ప్రధాన శక్తులన్నింటితో సుహృద్భావ సంబంధాలు కొనసాగిస్తున్న భారత్.. ప్రస్తుతం ఎటో ఒకవైపు మొగ్గాల్సిన సంకట స్థితిలో పడింది. తన ప్రమేయం లేకుండానే అమెరికా%–% చైనా శక్తుల మధ్య కేంద్ర బింధువుగా, బాధితురాలిగా మారుతున్నట్లు కనిపిస్తోంది. భారత్ జోక్యం చేసుకుంటేనే రష్యా%–% ఉక్రెయిన్ యుద్ధం ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే వాదిస్తున్నారు. అందుకు భారత్ స్పందించకపోవటంతో భారత వస్తువులపై 50 శాతం ప్రతీకార సుంకాలు విధించారు. దీంతో అనివార్యంగానే మనదేశం.. చైనా, రష్యాకు మరింత దగ్గర కావాల్సి ముస్తోయిదనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు అమెరికాను దెబ్బకొట్టాలంటే చైనా, రష్యాలకు కూడా భారతే కీలకంగా మాయిరింది. ఎస్‌సీఓ సమావేశానికి 10 సభ్య దేశాధినేతలు, మరికొన్ని ఆహ్వానిత దేశాల నేతలు విచ్చేసినా.. అందరి దృష్టి భారత ప్రధాని నరేంద్రమోదీపైనే కేంద్రీకృతమైంది. ఈ సమావేశం తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై సొంత దేశంలో విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. భారత్‌ను అనవసరంగా దూరం చేసుకున్నామన్న బాధ ఆ విమర్శల్లో కనిపిస్తోంది. అయితే, చైనాతో భారత సంబంధాలు తక్షణం గొప్పస్థాయికి వెళ్తాయన్న నమ్మకం లేదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. సరిహద్దు సమస్యే భారత్%–%చైనా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ప్రధాన అడ్డంకి అన్న చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ జనరల్ అనిల్ చౌహాన్ మాటలను గుర్తుచేస్తున్నారు.

# సైనిక శక్తి బలోపేతానికి మెగా డిఫెన్స్ ప్లాన్

న్యూఢిల్లీ

పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్‌తో గట్టిగా బదులిచ్చిన భారత్.. ఇప్పుడు తన సైనిక శక్తిని మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా అణుశక్తితో నడిచే యుద్ధ నౌకలు, నెక్స్ట్ జనరేషన్ యుద్ధ ట్యాంకులు, హైపర్ సానిక్ క్షిపణులు, లేజర్, ఏఐ ఆధారిత ఆయుధాలు,
స్టెల్త్ బాంబర్ డ్రోన్‌లు వంటి అత్యాధునిక ఆయుధాలను సైనిక దళాలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రచించింది. వచ్చే 15 ఏళ్లలో ఈ లక్ష్యాన్ని పూర్తిచేసేలా రక్షణ మంత్రిత్వ శాఖ ఒక రోడ్‌మ్యాపను సిద్ధం చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత్ చేపట్టిన అతిపెద్ద డిఫెన్స్ అప్‌గ్రేడ్ ప్లాన్ ఇదే కావడం విశేషం. ఈ రోడ్‌మ్యాప్ ప్రకారం పాత టీ–72 యుద్ధ ట్యాంకులను 1,800 ఫ్యూచర్ ట్యాంకులతో భర్తీ చేయనున్నారు. వీటితోపాటు మరో 400 తేలికపాటి యుద్ధ ట్యాంకులను కూడా సైన్యానికి అందిస్తారు. యుద్ధట్యాంకులపై నుంచి ప్రయోగించే 50,000 యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్స్, 700 రోబోటిక్ కౌంటర్ ఐఈడీ వ్యవస్థలను అందించనుంది. వీటితోపాటు 6 లక్షల శతఘ్ని గుండ్లు, మానవ రహిత విమానాలను కూడా సైన్యానికి అందించనున్నారు.

**నేవీ కోసం తర్వాతి తరం యుద్ధ నౌకలు**

నౌకాదళం కోసం సరికొత్త విమానవాహక యుద్ధనౌక, పది తర్వాతి తరం యుద్ధ నౌకలు, ఏడు అధునాతన కార్వెట్‌లు, నాలుగు ల్యాండింగ్ డాక్ ప్లాట్‌ఫారమ్‌లు



సమకూర్చనున్నారు. వీటితోపాటు అణుశక్తితో నడిచే యుద్ధ నౌకలు, ఎలక్ట్రో మాగ్నెట్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్ కూడా అందించనున్నారు. ఇక భారత వైమానిక దళం కోసం 75 హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్స్, 150 స్టెల్త్ బాంబర్ డ్రోన్లు, రిమోట్ సాయంతో పనిచేసే 100 విమానాలు, గైడెడ్ ఆయుధాలను అందిస్తారు. ఇవి కాకుండా యాంటీ స్వార్మ్ డ్రోన్ వ్యవస్థలు, లేజర్ ఆయుధాలు, ఏఐతో పనిచేసే ఆయుధాలు, మానవరహి విమానాల కోసం గగనతలం నుంచి భూమిపై ఉన్న లక్ష్యాలపైకి ప్రయోగించే క్షిపణు, అత్యాధునిక టార్గెటింగ్ ప్యాడ్స్ కూడా సమకూర్చనున్నారు.

## కొత్త దశలోకి భారత్-చైనా సంబంధాలు

న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లు భారత్‌పై ఒత్తిడి పెంచిన నేపథ్యంలో, భారత్?చైనా సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెడుతున్నాయి. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఉద్రిక్తతలతో నిండిన ఈ సంబం ధాలు, ఇప్పుడు ఆర్థిక, రాజకీయ అవసరాల ఆధారంగా సానుకూల మార్పుల వైపు సాగుతున్నాయి. మరోవైపు భారత్‌కు అనేక ప్రశ్నలు ఎదురవుతున్నాయి. కానీ మొదటి సమాధానం ట్రంప్ టారిఫ్ వారే చైనా?భారత్‌ను దగ్గర చేశాయి. ట్రంప్ పరిపాలన భారత్‌పై 50 శాతం వరకు టారిఫ్‌లను విధించడం, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను సాకుగా చూపడం ద్వారా భారత్?అమెరికా సంబంధాలకు గట్టి దెబ్బ తీసింది. ఈ టారిఫ్‌లు భారత ఎగుమతులు, ముఖ్యంగా వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా, భారత్ తన ఆర్థిక స్థిరత్వం కోసం చైనాతో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. 2024 అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీ, షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సమావేశాల్లో ఇరు దేశాల నాయకుల సమావేశం ఈ మార్పుకు నాంది పలికింది. అమెరికా ఒత్తిడి ఎదుర్కొనేందుకు భారత్, చైనా కలిసి నిలబడాలనే సందేశాన్ని ఈ సమావేశాలు ఇచ్చాయి. చైనా కూడా ఈ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ, భారత్‌తో సహకారాన్ని పెంచుకునే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో చైనా రాయబారి జు ఫీహాంగ్, ఇరు దేశాల స్నేహం ఆసియా, ప్రపంచ ఆర్థిక వృద్ధికి మేలు చేస్తుందని పేర్కొన్నారు.2020 గల్వాన్ లోయ ఘర్షణలో 20 మంది భారత సైనికులు, నలుగురు చైనా సైనికుల మరణం ఇరు దేశాల మధ్య సంబంధాలను తీవ్రంగా దెబ్బతీసింది. లద్దాఖ్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి ఇరు దేశాలు భారీగా సైన్యాన్ని మోహరించాయి, ఇది మూడు నాలుగేళ్లపాటు ఉద్రిక్తతలను కొనసాగించింది. అయితే, 2014 తర్వాత చైనా భారత భూభాగంలో ఒక్క అంగుళం కూడా స్వాధీనం చేసుకోలేదని, గల్వాన్, డోక్లాం వంటి ప్రాంతాల్లో భారత సైన్యం దృఢంగా నిలబడిందని గమనించాలి. ఇక 1962 భారత్?చైనా యుద్ధంలో చైనా అక్సాయ్ చిన్‌లో 30 వేల చ.కి.మీ భూమిని ఆక్రమించుకుంది. ఆ తర్వాత కూడా అనేక సందర్భాల్లో చైనా సరిహద్దు అతిక్రమణలకు పాల్ప డింది. అయితే, ఇటీవలి కాలంలో చైనా యుద్ధం కాకుండా శాంతి, సహకారాన్ని కోరుకుంటున్నట్లు కనిపిస్తోంది. 2024లో ఎస్‌సీవో సమావేశం తర్వాత చైనా సైనికులను ఉపసంహరించుకోవడం, కమాండెంట్ స్థాయి చర్చలు, విదేశాంగ మంత్రుల పరస్పర పర్యటనలు ఈ దిశలో సానుకూల సంకేతాలు.భారత ఆర్థిక స్థిరత్వం ఈ కొత్త విధానానికి పునాదిగా నిలుస్తోంది. 655 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు, 1% కన్నా తక్కువ జీడీపీ లోటు, నెలవారీ 68.7 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 2.4% రిటైల్ ఇన్‌ఫ్లేషన్, 8.9% సివిల్ ఉత్పాదక రంగ వృద్ధి, 7.8% స్టీల్ వినియోగం వంటి గణాంకాలు భారత్ యొక్క ఆర్థిక బలాన్ని సూచిస్తున్నాయి. ప్రపంచంలో ఐదో అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా, 81 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులతో భారత్ ఆర్థిక శక్తిగా ఉద్భవిస్తోంది.

# వయో వృద్ధ భారతం

న్యూఢిల్లీ

మన దేశ జనాభాలో వృద్ధుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ప్రతి పది మందిలో ఒకరు 60 ఏళ్ల పైబడిన వారు ఉన్నారు. నమూనా నమోదు సిస్టం (ఎస్ఆర్ఎస్)– 2023 నివేదిక ఇటీవల ఆ గణాంకాలను వెల్లడించింది. పడిపోతున్న జననాల రేటు, పెరుగుతున్న ఆయుర్దాయంతో వయో వృద్ధ భారతంగా దేశం మారుతోందని నిపుణులు చెబుతున్నారు. వయోధికుల ఆరోగ్య సంరక్షణ, పింఛన్లు, సామాజిక భద్రత విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివేదిక ప్రకారం దేశ జనాభాలో ప్రస్తుతం 60 ఏళ్లు పైబడ్డ వృద్ధులు 9.7 శాతంగా ఉన్నారు. 2011లో అది 8.6గా మాత్రమే ఉంది. 65 ఏళ్లు పైబడ్డ వారిలో పెరుగుదల 6.4 శాతంగా నమోదైంది. 60 ఏళ్లు పైబడిన వయోధికుల జనాభాలో కేరళ 15 శాతంతో అన్ని రాష్ట్రాల కంటే ముందు ఉంది. ఆ తర్వాత స్థానాల్లో తమిళనాడు, హిమాచల్, పంజాబ్, మహారాష్ట్ర వృద్ధుల జనాభా జాతీయ సగటు 9.7% కంటే ఎక్కువ ఉంది. ఇక బిహార్, మధ్యప్రదేశ్, యూపీ, జార?ండ్ రాష్ట్రాల్లో వయోధికుల జనాభా 8్ల లోపే ఉంది. అంటే ఈ రాష్ట్రాల్లో జనాభా వృద్ధి బాగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దక్షిణ, పశ్చిమ భారత రాష్ట్రాల్లో జనాభా తగ్గుముఖం పట్టింది.

**పెరుగుదలకు కారణాలు, సవాళ్లు**

వృద్ధుల జనాభా పెరుగుదలకు రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి, మొత్తం పునరుత్పత్తి రేటు (టీఎఫఆర్) జనాభా భర్తీ స్థాయి 2.1 కంటే తగ్గిపోవడం, రెండు.. ఆయర్దాయం పురుషులకు 68.5 ఏళ్లకు, మహిళలకు 72.5 ఏళ్లకు పెరగడం. టీఎఫఆర్ తగ్గడం వల్ల జనాభాలో పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. ఆయుర్దాయం పెరగడం వల్ల వృద్ధుల జనాభా పెరుగుతూపోతోంది. దేశంలో తక్కువ మంది ప్రజలు మాత్రమే శ్రామిక శక్తిగా ఉంటారు. యువత ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు ఆర్థిక ప్రగతి సాధిస్తాయి. వృద్ధ జనాభా ఎక్కువ ఉన్న రాష్ట్రాల్లో శ్రామిక శక్తి తక్కువగా ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. సంప్రదాయ ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. వృద్ధులు ఒంటరిగా మిగిలిపోయి ప్రభుత్వంపైనో, సేవా సంస్థలపైనో ఆధారపడాల్సి వస్తోంది.

**భవిష్యత్ కోసం చర్యలు తీసుకోవాలి**

ఇప్పటికీ దేశంలో యువ జనాభా ఎక్కువగానే ఉన్నా.. వృద్ధ జనాభాలో పెరుగుదల, పిల్లల జనాభా తగ్గుదల ఓ హెచ్చరికగా నిపుణులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వృద్ధుల జనాభా అధికంగా ఉన్న చైనా, జపాన్, యూరప్ దేశాల సరసన భారత్ కూడా చేరడానికి ఎంతో సమయం పట్టదంటున్నారు. వృద్ధులకు సదుపాయాలు కల్పిస్తూనే, యువ జనాభా పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.

## చైనాతో సరిహద్దు వివాదమే అతిపెద్ద సవాల్

న్యూఢిల్లీ

అమెరికా టారిఫ్‌ల తర్వాత చైనాతో భారత్ బంధం క్రమంగా బలపడుతున్న నేపథ్యంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ చైనాతో సరిహద్దు వివాదమేనని చెప్పారు. ఈ వివాదం కొనసాగుతూనే ఉంటుందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. పాకిస్తాన్ చేసున్న తెరచాటు యుద్ధం కూడా మనకు సమస్యాత్మకంగానే మారిందని తెలిపారు.  మన రెండు ప్రత్యర్థి దేశాలు అణ్వాయుధాలు కలిగిన దేశాలేనని గుర్తుచేశారు. ఆయా దేశాలకు వ్యతిరేకంగా ఆపరేషన్లు నిర్వహించే విషయంలో వాటివద్దనున్న అణ్వాస్త్రాలు మనకు ఒక సవాల్‌గానే ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో శుక్రవారం ఓ కార్యక్రమంలో అనిల్ చౌహాన్ మాట్లాడారు. పొరుగు దేశాల్లో అస్థిర పరిస్థితులు నెలకొనడం భారత్‌కు ఆందోళనకరమేనని చెప్పారు.  అక్కడ సామాజిక, రాజకీయ, ఆర్థికపరమైన అస్థిరత, అశాంతి ఏర్పడిందని పేర్కొన్నారు. భారత్‌ను ఎలాగైనా దెబ్బకొట్టాలన్న లక్ష్యంతో పాకిస్తాన్ వ్యవహరిస్తోందని వెల్లడించారు. వెయ్యి సార్లు యుద్ధం చేసైనా భారత్‌కు గాయపర్చాలన్నది పాకిస్తాన్ విధానమని చెప్పారు. ప్రత్యక్షంగా ఎదుర్కొనే ధైర్యం లేక తెరచాటు యుద్ధం చేస్తోందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌పై మనమే పైచేయి సాధించామన్నారు.  ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పకుండా భారత సైనిక దళాల చేతులు కట్టేశారంటూ వస్తున్న ఆరోపణలను అనిల్ చౌహాన్ ఖండించారు. మన సైన్యానికి ప్రభుత్వం అన్ని స్థాయిల్లో పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని స్పష్టంచేశారు. దాడులకు ప్లానింగ్‌తోపాటు లక్ష్యాలను నిర్దేశించుకోవడాన్ని మన దళాలకే అప్పగించినట్లు పేర్కొన్నారు.  ఆపరేషన్ సిందూర్ లక్ష్యం పాక్‌పై కేవలం ప్రతీకార దాడి కాదని.. మన సహనానికి రెడ్ లైన్ ఏమిటో ప్రత్యర్థికి చూపించడమేనని వ్యాఖ్యానించారు. ఆ రెడ్ లైన్ దాటితే పరిణామాలు ఎలా ఉంటాయో పాకిస్తాన్‌కు తెలిసొచ్చిందని ఉద్ఘాటించారు.  భవిష్యత్తులో యుద్ధక్షేత్రాల్లోని పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇప్పటినుంచే సన్నాహాలు చేపట్టాల్సిన అవసరం ఉందని అనిల్ చౌహాన్ చెప్పారు.  ఆధునిక కాలంలో యుద్ధరీతులు నానాటికీ మారిపోతున్నాయని, హైటెక్నాలజీ రంగ ప్రవేశం చేస్తోందని అన్నారు. సైబర్, అంతరిక్ష యుద్ధాలు కూడా జరుగుతాయన్నారు. సవాళ్లు అనేవి ఈ క్షణానికి సంబంధించినవి కాదని... అవి భిన్న కాలాల్లో భిన్న రూపాల్లో ఉంటాయని వ్యాఖ్యానించారు. ఎలాంటి సవాల్ అయినాసరే ఎదిరించడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

## స్మార్ట్ టీచర్ల అవసరమే ఎక్కువ

న్యూఢిల్లీ




విద్యార్థుల పురోభివృద్ధిని ఎప్పటికప్పుడు కనిపెడుతూ వారికి చదువుపై ఆసక్తిని పెంపొందించే స్మార్ట్ టీచర్ల అవసరం ఎంతో ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చెప్పారు. ఇటువంటి ఉపాధ్యాయులే దేశం, సమాజం అవసరాలకు అనుగుణంగా వ్యవహరించే సమర్థులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతారన్నారు. వివేకవంతులైన ఉపాధ్యాయులు పిల్లల్లో ఆత్మగౌరవం, భద్రతా భావాన్ని పెంపొందించడానికి కృషి చేస్తారన్నారు. శుక్రవారం రాష్ట్రపతి ముర్ము విజ్ఞానభవన్‌లో జరిగిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విశేష సేవలందించిన 60 మందికి పైగా ఉపాధ్యాయులను సన్మానించారు. స్మార్ట్ బ్లాక్ బోర్డులు, స్మార్ట్ క్లాస్‌రూంలు, ఇతర అత్యంత ఆధునాతన స్కూళ్లు, ఉన్నత విద్యా సంస్థల కంటే ఎక్కువగా స్మార్టు టీచర్లే ముఖ్యమని అనంతరం ఆమె తెలిపారు. ఉపాధ్యాయినిగా గడిపిన సమయమే తన జీవితంలో అత్యంత అర్థవంతమైందిగా భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థి నడవడికను తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుని ప్రాథమిక కర్తవ్యమని చెప్పారు. విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను జీవితాంతం గుర్తుంచుకోవడం, కుటుంబం, సమాజం, దేశానికి ప్రశంసనీయమైన సేవలందించడమే విద్యార్థులిచ్చే అతిపెద్ద కానుక అని రాష్ట్రపతి ముర్ము అన్నారు.  అవార్డుల ప్రదానోత్సవానికి ముందుగా ప్రధాని మోదీ ఉత్తమ అధ్యాపకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా వారితో..'విద్యార్థులకు ఉపాధ్యాయులు హోం వర్క్ ఇవ్వడం సహజం. నేను కూడా మీ అందరికీ ఒక హోం వర్క్ ఇవ్వాలనుకుంటున్నా. అదేమంటే.. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం. మేక్ ఇన్ ఇండియా, ఓకల్ ఫర్ లోకల్ ఉద్యమానికి సారథులుగా ఉండటం..'అని పేర్కొన్నారు.

# బప్పా యూత్ అసోసియేషన్

**విఘ్నేశ్వరుని లడ్డు వేలం పాటల విజేతలు..** మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ డివిజన్ సాయి నాగర్ లో ని బప్పా యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో కొలువైన గణనాధుని వద్ద నిత్య పూజలు అందుకున్న లడ్డూ ప్రసాదం ల వేలం పాటలు పోటా పోటీగా నడిచాయి స్వామి వారి మొదటి పెద్ద లడ్డూ ను చౌదరి యాదవ్ 97,000/- లకు దక్కించుకోగా రెండవ లడ్డూ శమిలేట్ రామస్వామి 35000/- ల కు దక్కించుకున్నారు. అఖిల శ్రీనివాస్ వారు కలశం చెంబును 35000/- లకు చేజిక్కించు కొన్నారు. ఈ సందర్భంగా బప్పా యూత్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం విఘ్నేశ్వర స్వామి నవరాత్రుల మహోత్సవం ను ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలియ జేశారు. స్వామి వారి లడ్డూ ప్రసాదం ను దక్కించుకున్న వారికి వారి కుటుంబ సభ్యులకు విఘ్నాలు తొలగించి విజయాలు సాధించేలా స్వామీ వారి కృపా కటాక్షముల ఉండాలని ఆకాంక్షించారు. వారికి శాలువా లతో సత్కరించి అభినందనలు తెలిపారు. వేలంపాట పాడి తీసుకున్నారు. వారిని కమిటీ సభ్యులు శాలువా తో సత్కరించి, స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళల వారి కుటుంబ సభ్యులకు ఉండాలి అని ఆకాంక్షించారు.





# విగ్రహ దాతని సన్మానించి,పవిత్ర కలశం అందచేసిన రామడుగు మాల సంఘం యువత..

**రామడుగు, సెప్టెంబర్ 05( ప్రభాత సూర్య):** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రామడుగు మండల కేంద్రంలోని మాల సంఘం యూత్ సభ్యులకు వాగ్దేవి డిగ్రీ కళాశాల చైర్మన్ పూరేళ్ల రాజాశేఖర్ వినాయక విగ్రహం స్పాన్సర్ చేసినందుకు గాను వారికి చిరు సన్మానం చేసి కలశం అందచేసిన మాల సంఘం యువత పూరేళ్ల శేఖర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు మూల వెంకటేష్, రామ్ పండు భాయ్, మాదం శివ, మాదం దీపక్ కుమార్, సూర్య ప్రకాష్,దిలీప్, పల్నాటి అభిలాష్,కృష్ణ జవ్వాజి వెంకటేష్ ,అనురాగ్ బాబు, అజయ్,సన్నీ,సిరికొండ అమర్, మధు, సాయి, పెద్దల, మహిళలు పాల్గొన్నారు



# అత్యంత వైభవంగా గణేష్ శోభాయాత్ర

**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్న హైదరాబాద్ గణేష్ నిమజ్జనానికి సర్వసిద్ధమైయ్యింది. అత్యంత వైభవంగా ఈ ఏడాది గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం నిర్వహించేందుకు ఇప్పటికే ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. నగర వ్యాప్తంగా సుదూర ప్రాంతాల నుండి ట్యాంక్ బండ్ వైపు భారీ గణేష్ విగ్రహాలు ర్యాలీగా రానున్న నేపథ్యంలో నగర వ్యాప్తంగా 6వ తేది ఉదయం 6గంటల నుండి 7వ తేది ఉదయం 10 గంటల వరకూ ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి రానున్నాయి. భారీ గణనాధుల శోభాయాత్రకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పక్కా ప్రాక్కా ప్లాన్ తో ప్రధాన రహాదారుల మీదుగా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. బాలాపూర్ నుండి శోభాయాత్రగా బయలుదేరే బాలాపూర్ గణపతి విగ్రహం చార్మినా?ర్ , అబిడ్స్ ,లిబర్టీ , ట్యాంక్ బండ్ మీదుగా నక్సెల్స్ రోడ్ కు చేరుకుంటుంది. నక్సెల్స్ రోడ్ వద్ద హుస్సెన్ సాగర్ లో నిమజ్జన కార్యక్రమం పూర్తి చేస్తారు. సికింద్రాబాద్ నుండి హుస్సెస్ సాగర్ వైపు తరలి వచ్చే గణేష్ విగ్రహాలు ప్యాట్నీ , ప్యారడైజ్ , రాణిగంజ్, కర్బలా మైదాన్ మీదుగా ట్యాంక్ బండ్ వద్దకు చేరుకుంటాయి. ఎల్బీనగర్ మీదుగా వచ్చే గణపతి విగ్రహాలు దిల్ షుక్ నగర్ , అంబర్ పేట్, నారాయణ గూడ, ఉప్పల్ మీదుగా వచ్చి లిబర్టీ వద్ద శోభాయాత్రలో కలసి అక్కడి నుండి నేరుగా హుస్సెన్ సాగర్ వద్దకు చేరుకుంటాయి. టోలీ చౌకీ , మెహదీపట్నం మీదుగా వచ్చే విగ్రహాలు ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్డులో నిమజ్జనం పాయింట్ వద్దకు చేరుకుంటాయి. ఆసీఫ్ నగర్ నుండి వచ్చే విగ్రహాలు ఎంజే మార్కెట్ వద్ద శోభాయాత్రలో కలుస్తాయి.

హైదరాబాద్ గణేష్ నిమజ్జనం రూట్ మ్యాప్.. ట్రాఫిక్ మళ్లింపు, ఆర్టీసి బస్సులకు సైతం ఆంక్షలు

6వ తేది (శనివారం ) ఉదయం నుండి మరుసటి రోజు ఉదయం 10గంటల వరకూ ఇతర వాహనాలను నగరంలో ప్రధాన రహదారులపైకి అనుమతించరు.

సౌత్ జోన్ ఈస్ట్ పరిధిలో ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లు.. కేశవగిరి, చంద్రాయాణగుట్ట, మూసారాంబాగ్, చంచల్ గూడ సౌత్ జోన్ డైవర్షన్ పాయింట్లు.. ఆలియా బాద్, మదీనా, నయాపూర్ , ఎంజే మార్కెట్, దరుశ్శిఫా ఈస్ట్ జోన్ డైవర్షన్ పాయింట్లు.. శివాజీ బ్రిడ్జి, పుత్లీబౌలీ, హిమాయత్ నగర్, వైఎంసిఎ సెంట్రల్ జోన్ డైవర్షన్ పాయింట్లు.. లిబర్టీ, అబిడ్స్ , ఖైరతాబాద్ , ట్యాంక్ బండ్ , బుద్ధభవన్

నార్త్ జోన్ డైవర్షన్ పాయింట్లు.. పాట్నీ, పారడైజ్, రాణిగంజ్ హుస్సేస్ సాగర్ వద్ద విగ్రహాల నిమజ్జనం కోసం భారీగా వాహనాలు ట్యాంక్ బండ్ వద్దకు రానున్న నేపథ్యంలో ప్రత్యేక పార్కింగ్ ప్రదేశా?లను కేటాయించారు. ఎన్టీఆర్ స్టేడియం, కట్టమైసమ్మ గుడి, పబ్లిక్ గార్డెన్స్, బుద్ధభవన్ వెనుక, ఆదర్శ నగర్ , బిఆర్ కే భవన్, ఖైరతాబాద్ ఎంఎంటీఎస్ స్టేషన్ ల వద్ద నిమజ్జనాకి? వచ్చే వాహనాల పార్కింక్ చేసుకోవచ్చు.నిమజ్జనం పూర్తి చేసుకున్న తరువాత భారీ వాహనాలు, లారీలు నగరంలోకి రాకుండా ,అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా వెళ్లేలా దారిమళ్లించనున్నారు. 6వ తేది ఉదయం 8గంటల నుండి 11వతేది ఉదయం 11గంటల వరకూ లారీలకు నగరంలోకి అనుమతి లేదు. నిమజ్జన నేపథ్యంలో ఆర్టీసి బస్సులకు సైతం ఆంక్షలు తప్పలేదు. రద్దీ ఎక్కువగా ఉన్న సమాయాల్లో ఆర్టీసి బస్సులను మెహదీపట్నం, కూకట్ పల్లి, సికింద్రాబాద్, ఉప్పల్, దిల్ షుక్ నగర్ , నారాయణగూడ వరకే పరిమితం చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చే ఆర్టీసీ బస్సులను చాధర్ ఘట్ వైపు దారిమళ్లించనున్నారు. ఈ జంక్షన్ల వైపు నో ఎంట్రీ.. ఎంజే మార్కెట్, ఖైరతాబాద్, అబిడ్స్, లిబర్టీ, రాణిగంజ్ , తెలుగుతల్లి చౌరస్తా, ట్యాంక్ బండ్, నక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా..

విమానాశ్రయం వెళ్లేవారు పివిఎన్ ఆర్ ఎక్స్ ప్రెస్ ఫ్లైఓవర్ లేదా అవుట్ రింగ్ రోడ్ మాత్రమే ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వెళ్లేవారు బేగంపేట్ , ప్యారడైజ్ రూట్ వాడుకోవాలి. ఇదిలా ఉంటే నిమజ్జనం కోసం ప్రత్యేకంగా 10 బేబి పాండ్లు, పోర్టబుల్ వాటర్ ట్యాంక్ లు 8, ఎక్స్ వేషన్ పాండ్లు 8 ఏర్పాటు చేశారు. నిమజ్జనం సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే స్పందించేందుకు ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబర్ ను ఏర్పాటు చేశారు. హెల్ప్ లైన్ నెంబర్లు : 040- 27852482 , 8712660600 , 9010203626



# మోదీజీ చిత్రపటానికి క్షీరాభిషేకం

**జీఎస్టీ సంస్కరణల వల్ల పేద ప్రజలకు ఊరట..**

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్..**

**జగిత్యాల/పెగడపెల్లి :** వస్తుసేవల పన్నులో ప్రభుత్వం తీసుకు వచ్చిన సంస్కరణల వల్ల దేశం అభివృద్ధి చెందుతుందని పేద మధ్య తరగతి కుటుంబాలకు నిత్యావసర వస్తువులు చౌకధరలకే దొరుకుతా యని దీంతో బోలెడన్ని ప్రయోజనాలు చేకూరుతాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ అన్నారు. పెగడపెల్లి మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ స్లాబ్ రేట్లను తగ్గించడం వల్ల రాష్ట్రాల ఆదాయం కోల్పోతామని కొన్ని రాష్ట్రాలు గగ్గోలు పెడుతున్నాయని వారికి పేద మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలతో అవసరం లేదన్నట్లు ప్రభుత్వాల కు ఆదాయమే ధ్యేయంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నా రు. జీఎస్టీ సవరణ వల్ల తెలంగాణ ప్రభుత్వం ఆరువేల కోట్లు నష్టపోతుందని ఇది సరైన పద్ధతి కాదని తెలంగాణ ప్రభుత్వ పెద్దలు మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు.గతంలో పెట్రోల్ పై ముప్పది రెండు రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా పన్ను రూపంలో వసూలు చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తె అట్టి పన్నును రద్దు చేస్తామని చెప్పి ఇంతవరకు ఎందుకు చేయలేదని ప్రశ్నించా రు.కేంద్ర ప్రభుత్వం చేసిన సరళీకృత పన్ను విధానం ద్వారా దేశీయ ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతుందని అమెరికా అగ్రరాజ్యం భారత్ పై పన్నుల రూపంలో ఎంత టారిఫ్ వేసిన భారతదేశానికి ఒరిగే నష్టం ఏమీ లేదని నరేంద్రమోడీ ప్రభుత్వం రుజువు చేస్తుందని అన్నారు.పండుగల వేల కేంద్ర ప్రభుత్వం భారతదేశంలోని రైతులకు,విద్యార్థులకు, మహిళలకు, పేద మధ్య తరగతి ప్రజలకు మోదీ పెద్ద గిఫ్ట్ ఇచ్చారని కొనియాడారు.ఒకే దేశం ఒకే ప్రజా,ఒకే దేశం ఒకే పన్ను,ఒకే దేశం ఒకే ఎలక్షన్,ఒకే దేశం ఒకే రేషన్,ఒకే దేశం ఒకే చట్టం లాంటి సాహసోపే తమైన నిర్ణయాలు తీసుకుంటూ ప్రపంచ దేశాలతో పోటీ పడి అగ్రరాజ్యాల సరసన భారతదేశాన్ని నిలబెడుతు న్నారని అన్నా రు. కాంగ్రెస్ హాయంలో భారతదేశాన్ని అమె రికా ముందు మోకరిల్లెలా చేసిందని కానీ నేడు నరేంద్రమోది నాయ కత్వంలో అమెరికా కు వెన్నులో వణుకు పుట్టేలా చేస్తుందని అన్నారు.

## గణనాథుడికి ప్రత్యేక పూజలు....

పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్.....



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** శేర్లింగంపల్లి నియోజవర్గంలోని హఫీజ్ పేట్ డివిజన్ లో ని కృష్ణ నగర్ గణేశ్ ఉత్సవ కమిటీ, కృష్ణ కాలనీ, న్యూ హఫీజపేట్ డివిజన్ లో గణనాథుడికి ఘనంగా పూజలు నిర్వహించారు.పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ పాల్గొని స్వామి వారి ఆశీస్సులను పొందారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కృష్ణ నగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకోవాలి ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ నగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

## ఖుదాబక్ష్‌పల్లి గ్రామంలో గణనాథుడి సేవల కోసం మాజీ ఎంపీపీ విరాళం



**మర్రిగూడ ప్రభాతసూర్య 5** నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం ఖుదాబక్షపల్లి గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్దకు మర్రిగూడ మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంత రాజు గౌడ్ గారు విచ్చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు జిలగోని కిరణ్ ముదిరాజ్ సమక్షంలో అనంత రాజు గౌడ్ గారిని శాలువాతో సత్కరించారు. తదుపరి ఆయన గణనాథుడి సేవల కోసం శివాజీ యూత్ కమిటీకి ?5,000/- విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జిలగోని కిరణ్ ముదిరాజ్, గండు శీను గౌడ్, అజయ్, జిలగోని గణేష్, కంబాలపల్లి ప్రవీణ్ యాదవ్, జిలగోని ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రామ్ సేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న

కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి



**సంస్థాన్ నారాయణపూర, సెప్టెంబర్ 05( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర మండల కేంద్రంలో రామ్ సేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మందు గుల బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి ఏపూరి సతీష్, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, ఉప్పల నాగరాజు, మారగోని శంకర్ గౌడ్, బద్దుల మురళి యాదవ్, పాలకూర స్వామి, బానోతు కిరణ్ నిర్వాకులు గూడూరు మంజునాథ్ రెడ్డి, గూడూరు ఇంద్రసేనారెడ్డి, పల్లె సీతారామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## మార్కండేయనగర్‌లోని

లడ్డూను రూ.72 వేలకు దక్కించుకున్న బుసం భానుచందర్



**గండిపేట్ :సూర్య ప్రతినిధి** భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్ లో ప్రతిష్టించిన గణపతి లడ్డూ వేలం పాటలో పోటా పోటీగా సాగిన లడ్డు వేలం పాటలో దక్కించుకున్న బుసం భానుచందర్ రూ.72 వేలకు దక్కించుకున్నాడు. అనంతరం శోభయాత్రగా బయలుదేరి వినాయకుడిని నిమర్జనం చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చౌరస్తా యువజన సమైక్య ఆధ్వర్యంలో

లడ్డూను రూ.31 వేలకు

దక్కించుకున్న నాతి బంగారు రాజు



**సంస్థాన్ నారాయణపురం,సెప్టెంబర్ 05( ప్రభాత సూర్య):** భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని చౌరస్తా యువజన సమైక్య ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతి లడ్డూ వేలం పాటలో పోటా పోటీగా సాగిన లడ్డు వేలం పాటలో దక్కించుకున్న బంగారు రాజు రూ.31 వేలకు దక్కించుకున్నాడు. అనంతరం శోభయాత్రగా బయలుదేరి వినాయకుడిని నిమర్జనం చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మన్నెగూడలో గణేశ నవరాత్రుల లడ్డు వేలం పాటలో విజేత అనంత రాజు గౌడ్

**హైదరాబాద్ ప్రభాత సూర్య 5** రంగారెడ్డి జిల్లా మన్నెగూడలోని పగోడా ప్లాజా విల్లాస్‌లో పగోడా ప్లాజా అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలం పాటలో కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీపోటీగా బిడ్లు వేశారు. ఈ వేలం పాటలో మర్రిగూడ మాజీ ఎంపీపీ, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంత రాజు గౌడ్ పాల్గొని, రూ?4,11,116/-లకు విఘ్నేశ్వరుని లడ్డు ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. తరువాత కమిటీ సభ్యులు, బ్రాహ్మణులు ఆయనను శాలువాతో సన్మానించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.



అనంత రాజు గౌడ్ గారి కుటుంబం సుఖసంతోషాలతో,



ఆయురారోగ్యాలతో, ధనధాన్యాలతో అభివృద్ధి చెందాలని వినాయకుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.

# రోజ్ బడ్స్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

-విద్యార్థులను తీర్చిదిద్దటంలో గురువుల కృషి వెలకట్టలేనిది

-ప్రధానోపాధ్యాయురాలు జానీ బేగం

**చౌటుప్పల్.సెప్టెంబర్ 05. ప్రభాత సూర్య :** విద్యార్థులను తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని రోజ్ బడ్స్ ప్రధానోపాధ్యాయురాలు జానీ బేగం అన్నారు. పట్టణ కేంద్రంలోని రోజ్ బడ్స్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జానీ బేగం మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గొప్పతనాన్ని, ఆయన ఉపాధ్యాయులకు ఎందుకు మార్గదర్శకులు అనే దానిపై విద్యార్థులకు వివరించారు. భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనదని, తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదన్నారు. ఒక వ్యక్తి, సమాజ, జాతి నడకకు, నడతకు, పురోగతికి, శ్రేయసుకు గురువు మార్గదర్శనం తప్పనిసరిని విద్యార్థులకు తెలిపారు. గురువు మన జీవితానికి



వెలుగు చూపే దీపం లాంటివాడని అటువంటి ఉపాధ్యాయులను విద్యార్థులు గౌరవించాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రిన్సిపల్ జానీ వేగం ను ఘనంగా సన్మానించారు. అనంతరం శుక్రవారం ఉపాధ్యాయ



దినోత్సవంను పురస్కరించుకొని తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించి మెమొంటోల్లు అందజేశారు. విద్యార్థులు సంస్కృతి నిర్వహించి, ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జానీ వేగం, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

-ట్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు...

-ప్రతి ఒక్కరూ మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి...

-ఉపాధ్యాయ వృత్తి దేవుడిచ్చిన గొప్ప వరం...

-మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు

-ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల

**చౌటుప్పల్.సెప్టెంబర్ 05. ప్రభాత సూర్య :** ప్రతి ఒక్కరూ మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని చౌటుప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ పట్టణ మున్సిపాలిటీ కేంద్రంలోని ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ కృష్ణరావు, ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం సరళ మైసమ్మ దేవాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, వెన్ రెడ్డి సంధ్య, పంతంగి గ్రామ మాజీ సర్పంచ్ బాతరాజు సత్యం ముఖ్య అతిథులుగా పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి కార్యక్రమాన్ని వారి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని అధ్యాపక బృందాన్ని శాలువాలతో ఘనంగా



సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు మాట్లాడుతూ.... విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దటంలో గురువుల కృషి వెలకట్టలేనిదన్నారు. విద్యార్థుల పట్టుదలకు, సాధించాలనే తపనకు గురువు మార్గదర్శకం తోడైతే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నా,ఒక తరాన్ని ముందుకు నడిపించాలన్న అది గురువులకే సాధ్యపడుతుందన్నారు. విద్యార్థులు గురువులు నేర్పే విద్యా బుద్ధులతో భవిష్యత్తులో గొప్పగా ఎదిగి తల్లిదండ్రులకు, గురువులకు గొప్ప పేరు తెచ్చిపెట్టేలా గురువులు కృషి చేయాలని కోరారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ స్థాయి నుండి రాష్ట్రపతి స్థాయి వరకు ఎదిగారని వారిని ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులు తమ వృత్తిలో రాణించాలని తెలిపారు. దేశం అభివృద్ధి సాధించాలన్నా, ఒక



వ్యక్తి గొప్ప వ్యక్తిగా తీర్చిదిద్దబడాలన్నా అది ఉపాధ్యాయులకే సాధ్యమన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించడం తనకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం డాక్టర్ ఉజ్జని మంజుల మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు చక్కని విద్యాబుద్ధులు నేర్పటం తమకు దేవుడిచ్చిన వరంగా భావిస్తామని తెలిపారు. అధ్యాపక బృందం పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజులను, ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ వెన్ రెడ్డి సంధ్య, పంతంగి గ్రామ మాజీ సర్పంచ్ భాతరాజు సత్యం, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ చర్యలు



-ఏసీపీ పి మధుసూదన్ రెడ్డి, సీఐ జి.మన్మథ కుమార్ ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు...

-భక్తులు నిమజ్జనాన్ని ప్రశాంతంగా చేసుకోవాలి...

-చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి

**చౌటుప్పల్.సెప్టెంబర్ 05. ప్రభాత సూర్య :** చౌటుప్పల్



మండల కేంద్రంలో గణేష్ నిమజ్జనాలు జరిగే చోట పకడ్బందీ చర్యలు తీసుకున్నామని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం గణేష్ నవరాత్రి శోభాయాత్రలో భాగంగా చౌటుప్పల్ మండల కేంద్రంలోని పెద్ద కొండూరు చెరువు ప్రాంగణంలో గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను చౌటుప్పల్ ఏసిపి పి మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మథ కుమార్, మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి ల పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్రేన్ ద్వారా గణేష్ నిమజ్జనంకు సేవలకు అన్ని విధాలుగా చర్యలు చేపట్టి భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జనాలు జరిగేటప్పుడు అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా ఉత్సాహ కమిటీ సభ్యులు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. నిమజ్జనం జరిగే చోట పటిష్టమైన భద్రత, మెడికల్ క్యాంపులు, పోలీసుల సహకారంతో బందోబస్తు ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. నిమజ్జనం సందర్భంగా భక్తులు పోటీ పడరాదని, ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జనం నిర్వహించుకోవాలని నిర్వాహకులను కోరారు. చిన్నపిల్లలు నిమజ్జన సమయంలో చెరువు లోపలికి వెళ్లేందుకు పాల్గొనకూడదని సూచించారు. నిమజ్జనం సందర్భంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్, ఎస్ఐ యాదగిరి, జిల్లా ఎస్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ సుమన్ కళ్యాణ్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, అంజయ్య, మున్సిపల్ కార్మికులు, ఆశ వర్కర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శివాలయ దేవస్థానం గట్టుప్పల నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం



**గట్టుప్పల్ ప్రభాతసూర్య 5** బ్రహ్మశ్రీ మాడ వెంకటరమణ శర్మ గారి ఆధ్వర్యంలో శుక్రవారం గట్టుప్పల శివాలయ దేవస్థానం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు : మాదగాని సత్తయ్య గౌడ్‌గౌరవ సలహాదారు : రాపోలు మధుసూదన్ అధ్యక్షులు : గంజి కృష్ణయ్య కార్యనిర్వాహక అధ్యక్షులు : చెరిపెల్లి ఆంజనేయులు ఉపాధ్యక్షులు : కర్నాటి వెంకటేశం, బొల్లెపల్లి వెంకటేశం, భీమ గాని మల్లేశం ప్రధాన కార్యదర్శి : మోదుగు సత్తిరెడ్డి కోశాధికారి : బావండ్ల శ్రీనివాస్ సహాయ కార్యదర్శులు : కర్నాటి సుధాకర్, సంగేపు శ్రీహరి, నీలాంటి వెంకటేశం మరియు మరో 17 మంది సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నామని జగన్నాథం ముత్తారెడ్డి, పున్న కిషోర్, చిలుకూరు అంజయ్య, బండారు శ్రీరాములు, ఆనందు తదితరులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా బొడ్డు మధు ఎన్నిక

-మూడు తరాలుగా కమ్యూనిస్టు కుటుంబ నేపథ్యం

-విద్యార్థి యువజన సంఘాల్లో గ్రామస్థాయి మండల డివిజన్ జిల్లా నాయకుడి గా అంచెలంచెలుగా ఎదిగిన మధు

-అనాసాగరం గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్ గా ప్రజా సమస్యల పై పోరాటం



**ఖమ్మం ( సూర్య ప్రతినిధి )** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అనాసాగరం గ్రామం నుండి జిల్లా యువజన ( డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా)నాయకుడిగా ఎదిగిన మధు చిన్నతనం నుండి కమ్యూనిస్టు పార్టీ కుటుంబ నేపథ్యం కావడం గ్రామంలో కమ్యూనిస్టు ప్రభావం ఎక్కువగా ఉండటం కుటుంబం మూడు తరాల నుండి కమ్యూనిస్టుగా ఉండటం వలన కమ్యూనిస్టు భావాలవైపు ఆకర్షితులై విద్యార్థి ఉద్యమం 2008 లో గవర్నమెంట్ హైస్కూల్ నేలకొండపల్లి ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యుడిగా ఉద్యమ ప్రస్థానం మొదలైంది. అనాసాగరం గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ మండల కార్యదర్శి నేటి జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరావు ఆశీస్సులతో సహకారంతో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ నాయకుడిగా డివిజన్ నాయకుడిగా పనిచేశాడు. డిగ్రీ పూర్తి కావడం తర్వాత 2017 జిల్లా కమిటీ సభ్యుడిగా డివైఎఫ్ఐ లో పనిచేశారు. గ్రామంలోని యువకుల సమస్యలపై పోరాటం చేస్తూ డివైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి డివైఎఫ్ఐ నేలకొండపల్లి మండల కార్యదర్శిగా జిల్లా కమిటీ సభ్యుడిగా 2020 డిసెంబర్ 20 న ముదిగొండలో లో జరిగిన 20 వ జిల్లా మహాసభల్లో జిల్లా సహాయ కార్యదర్శిగా 2023 నుండి జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతను నిర్వహించాడు. 2025 డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన యువ చైతన్య సైకిల్ యాత్రలో 12 రోజులు పాటు జిల్లా మొత్తం పాల్గొన్నారు. గ్రామంలో వార్డు మెంబర్ గా పనిచేసి గ్రామ సమస్యల మీద అనేక సందర్భాల్లో పోరాటాలు నిర్వహించి విజయాల సాధించాడు. ముఖ్యంగా చేపల చెరువు సమస్య పైన ఊర్లో ఉన్న వారికే పాట ద్వారా దక్కాలని దశలవారీగా పోరాటం చేసి విజయం సాధించే దాంట్లో కీలకపాత్ర పోషించాడు. 2025 ఆగస్టు 31న జరిగిన జిల్లా మహాసభ లో నూతన జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యువజన ఉద్యమానికి బొడ్డు మధు జిల్లా కార్యదర్శి ఎన్నిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మధు మాట్లాడుతూ నాపై నమ్మకం నుంచి జిల్లా బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి నేలకొండపల్లి పార్టీ కమిటీ కి తన ఉద్యమంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సీతోనే రజకుల అభివృద్ధి ? సర్ధార్ గోపి రజక

సీఎం ఇందిరమ్మ కలలను సాకారం చేయాలన్న సాయి



**మెదక్, సెప్టెంబర్ 05( ప్రభాత సూర్య ):** రజక కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఎస్సీ జాబితాలో చేర్చితేనే సాధ్యపడుతుందన్న సర్ధార్ గోపి రజక. మెదక్ జిల్లా టేక్మల్ మండల కేంద్రంలో రజక భవనంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మండల అధ్యక్షులు కర్రొల్ల రమేష్ , జిల్లా అధ్యక్షులు ఎర్రొల్ల కుమార్ , జిల్లా యూత్ అధ్యక్షులు సిహెచ్ ఉపేందర్ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా నాయకుల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ 56/1984 ఆర్డినెన్సును దేశవ్యాప్తంగా అమలుచేసి అంటరానితనాన్ని ఎదుర్కొంటు , సమాజానికి సేవా చేస్తు అభివృద్ధికి నోచుకోక అవమానాలు భరిస్తున్న దోభీల కష్టాలను గుర్తించి వారిని ఎస్సీ జాబితాలో చేర్చాలని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న ఆనాటి ప్రధానమంత్రి ఇందిరమ్మ కలలను సాకారం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సాయి మాట్లాడుతూ 2016 డిసెంబర్ 26న అసెంబ్లీలో రజక కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని మాట్లాడిన నేటి ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఇందిరమ్మ కలలను సాకారం చేసే దిశగా అడుగులు వేయాలని కోరారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, పార్లమెంట్లో ఎంపీలు ఎస్సీ అంశంపై మాట్లాడటం జరిగింది కాని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని వాపోయారు. జిల్లా ముఖ్యనాయకుల సమావేశానికి కర్రొల్ల గంగారాం, ఎర్రొల్ల దుర్గయ్య,సంగనవల్ల పోచయ్య,గొలకుంటి జగన్,బాలింగన్ రాజమ్మ ,బి.రాంబాయి ,బి.గణేష్ ,బి.సాయమ్మ,పొట్టొల్ల నర్సమ్మ,మల్లని బాగ్య,పరమటి శ్రీను ,సాయనొల్ల అనిల్,ఎస్.సతీష్ ,వై. వంశీకృష్ణ ,డి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలి

-సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం

**చౌటుప్పల్.సెప్టెంబర్ 05. ప్రభాత సూర్య:** 60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు 10వేల రూపాయల వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చౌటుప్పల్ లో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ, మండల 5వ మహాసభను స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. కళకుంట్ల శివ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ పెడరేషన్ జిల్లా అధ్యక్షులు గొరిగే సోములు, సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం ముఖ్యఅతిథిలుగా హాజరై మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు కేటాయించిన 6వేల కోట్ల రూపాయలను వెంటనే వెల్ఫేర్ బోర్డుకు జమ చేయాలని, 11 రకాల సంక్షేమ ఫలాలను కార్మికులకు సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రావాల్సిన ప్రమాద బీమా లను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెబుతున్నారని దీని మూలంగా ప్రైవేటు దళారీలను పెంచి పోషించడం జరుగుతుందని దిన్ని రద్దు చేసి ప్రభుత్వం ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. సి.ఎస్.సి అనే హెల్త్ కంపెనీకి భవన నిర్మాణ కార్మికుల ఆరోగ్య పరీక్షల కోసం ఒక్కరికి 3300 రూపాయలు ఇస్తున్నారని ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో 464 కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. సంక్షేమ బోర్డులో దరఖాస్తు చేసిన వారికి ప్రాథమిక విచారణ చేసి గుర్తింపు కార్డును ప్రతి ఒక్క కార్మికుడికి ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అడ్డాలు ఏర్పాటు చేసి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, కూలీకి కనీస వేతనం కల్పించాలని తెలిపారు. వెల్ఫేర్ బోర్డులో దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో క్లెయిమ్ లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ చట్టాలకు వ్యతిరేకంగా కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యండి పాషా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొరిగే సోములు, సీఐటీయూ



జిల్లా కమిటి సభ్యులు ఆదిమూలం, నందీశ్వర్, బత్తుల దాసు, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు గుణమోని రాములు, మండల అధ్యక్షులు చీమకండ్ల శ్రీరాములు ,నాయకులు నెల్లికంటి నరసింహ , తెగుళ్ల రమేష్,దౌడి యాదగిరి,బండెల ఈశ్వర్, తగరం ఎల్లయ్య, జజూల బిక్షపతి గడగోటి జంగయ్య, బాతరాజు రమేష్,గజ్జెల రాజు, తిగుళ్ళ యాదయ్య పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది ..

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**రిమర్రిగూడ సెప్టెంబర్ 5 (ప్రభాత సూర్య)** మర్రిగూడ మండలం నుండి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కు ఎంపికై ఈరోజు నల్గొండ పట్టణంలోని చిన్న వెంకటరెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో గౌరవ రోడ్లు భవనాల శాఖ మంత్రి వర్యులు శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి చేతుల మీదుగ డి. మంజుల స్కూల్ అసిస్టెంట్ ఎంపీ యుపిఎస్ వట్టిపల్లి, బాడిగఅంజయ్య, టి.రత్నకుమారి,ఎస్ జి టి ఎంపీ యుపిఎస్ రా%శీ%రెడ్డి పల్లి, పోతుగంటి స్వప్న ఎంపీపీఎస్ ఇందుర్తి, కె .స్వరాజ్యం, పిఎస్ హెచ్ఎం ఎంపీపీఎస్ శివన్నగూడ,వై. మంజులత ఎంపీపీఎస్ దామర భీమనపల్లి, సబిత, పిజిటి టిజి ఎంఎస్ మర్రిగూడ గార్లకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన సందర్భంగా శాసనమండలి సభ్యులు నెల్లికంటిసత్యం గారు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీతల ను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవార్డు మీ పట్ల మరింత బాధ్యతను పెంచిందని విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలోకి



పయనింపచేయాలని పాఠశాలలో నాణ్యత విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బిట్టు శ్రీనివాస్, టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి, ఎస్సీ ఎస్టీ సంఘం రాష్ట్ర నాయకులు ఉదావత్ లచ్చి రామ్ నాయక్, టీఎస్ యుటిఎఫ్ జిల్లా సాంస్కృతిక కార్యదర్శి గిరి యాదయ్య, మండల అధ్యక్షులు ఎన్ .శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎస్.వెంకట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి

**సంస్థాన్ నారాయణపూర, సెప్టెంబర్ 05( ప్రభాత సూర్య):** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్137 వ జన్మదినము ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ఈసీ విద్యాసాగర్ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ కట్ల భాస్కరాచారి, ఉపాధ్యాయ బృందం తో పాటు ముఖ్యఅతిథిగా మండల కాంగ్రెస్ నాయకులు ఉప్పల లింగస్వామి పాఠశాలకు విచ్చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించినారు పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదగాలని మంచి విద్యను నేర్చుకొని దేశానికి పాఠశాలకు పేరు తేవాలని కోరారు



తదనంతరం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు సన్మానం తోపాటు పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు




ముందుగుల బాలకృష్ణ,సతీష్, రాచకొండ రమేష్,ఏలే హనుమంతు,రిటైర్డ్ ఉపాధ్యాయులు బాలగోని యాదయ్య చిలువేరు శంకర్, రత్తుపల్లి యాదయ్య, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# శివన్నగూడెంలో అన్నదానానికి దాతగా నిలిచిన మర్రిగూడెం మాజీ ఎంపీపీ అనంత రాజు గౌడ్







**మర్రిగూడ ప్రభాత సూర్య5** నల్లగొండ జిల్లా, మర్రిగూడ మండలం, శివన్నగూడెం గ్రామంలో శ్రీ వినాయక ఉత్సవ కమిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరా నగర్ కాలనీలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో, మర్రిగూడ మాజీ ఎంపీపీ అనంతరాజు గౌడ్ అన్నదానం దాతగా నిలిచి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రైమ్ మిర్రర్ సీఈవో మాకం గంగాధర్ 5116/- ఇచ్చి దాతగా నిలిచారు. ఈ సందర్భంగా అనంత రాజుగౌడ్ మాట్లాడుతూ "వినాయకుడి పండుగ చిన్నారులకు, యువతకు, పెద్దలకు, భక్తులకు ఎంతో ఆనందాన్ని, ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగించడమే కాకుండా ధైర్యాన్ని, భక్తి మార్గాన్ని చూపిస్తుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివన్నగూడెం మాజీ సర్పంచ్ సబితా యాదగిరి రెడ్డి, సిద్ధగోని వెంకటేష్ గౌడ్, మర్రిగూడ ఆంధ్రప్రభ రిపోర్టర్ కొంపెల్లి నాగరాజ్, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు భారీగా పాల్గొని అన్నదానాన్ని విజయవంతం చేశారు.

# వెళ్లి రావయ్యా... మా బొజ్జ గణపయ్య

**చౌటుప్పల్.సెప్టెంబర్ 05. ప్రభాత సూర్య:** విఘ్నాన తొలగించే గణనాథుడు నవరాత్రి ఉత్సవాలు ముగించుకుని గంగమ్మ చెంతకు చేరుకున్నాడు. శుక్రవారం భక్తుల జయ జయ ధ్వానాల మధ్య నయనానందకరంగా శోభాయాత్ర భక్తులు నిర్వహించారు. లంబోధరుడి నిమజ్జనం ఎంతో ఉత్సాహంగా సాగింది. చౌటుప్పల్ పట్టణ, మండల కేంద్రంలోని పలు గ్రామాలలో తొమ్మిది రోజులపాటు భక్తుల చేత విశేష పూజలు అందుకున్న గణనాథులు నిమజ్జనానికి బయలుదేరగా మహిళలు మంగళహారతులు, కోలాటాలతో వీడ్కోలు పలికారు. గణనాథుని శోభాయాత్ర విశేషాలంకరణలు, విభిన్న రూపాలతో విగ్రహాలను భక్తులు డిజె సౌండ్లతో, డప్పు చప్పుల మధ్య అట్టహాసంగా కొనసాగించారు.



అధికారులు సూచించిన నిమజ్జన ప్రదేశాలలో మున్సిపల్



అధికారులు, పోలీసు అధికారుల సహాయసహకారంతో గణనాథుని నిమజ్జనం గావించారు.

## కానుగుల సత్యవతికి ఘన సన్మానం

-తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు...




**చౌటుప్పల్.సెప్టెంబర్ 05, ప్రభాత సూర్య:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పురపాలక కేంద్రంలో భువనగిరి శ్రీరామ్ మినీ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు . శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చౌటుప్పల పట్టణానికి చెందిన పదవి విరమణ పొందిన ఉపాధ్యాయురాలు కానుగుల సత్యవతిని శాలువాతో ఘనంగా సత్కరించి మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయురాలు కానుగుల సత్యవతి మాట్లాడుతూ... తనకు ఉపాధ్యాయ వృత్తి దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నానని, ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిదన్నారు. తనకు ఉపాధ్యాయ వృత్తి ఎంతో సంతృప్తిని కలిగించిందని ఈ సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులను తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమములో జిల్లా అధ్యక్షులు పూర్ణచంద్ర రాజు , ప్రధాన కార్యదర్శి వెంకటేశం, జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు , యాదాద్రి జిల్లా అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి



**సంస్థాన్ నారాయణపూర, సెప్టెంబర్ 05( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర మండల ప్రజలకు సెప్టెంబర్ 07 ఆదివారం రోజు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపూర్ మండల ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడును ఉచిత వైద్య శిబిరం వేదిక నారాయణపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమయం ఉదయం 9 గంటల నుండి ప్రారంభమవుతుంది. 50 సంవత్సరాల వయసు పైబడిన వారు ఇట్టి అవకాశం సద్వినియోగపర్చుకోగలరు... ముఖ్య గమనిక -కంటి శుక్లాల ఆపరేషన్ అవసరం ఉన్న వారిని సోమవారం రోజున అన్ని టెస్టులు చేసి హైదరాబాద్ తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి తీసుకొస్తారు.. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోగలరు అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి అన్నారు

## కంఠ మహేశ్వర కమిటీ ఎన్నిక అధ్యక్షులు పాలకుర్ల యాదయ్య, కార్యదర్శి కొండ శ్రీకాంత్



**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 05( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని కంఠమహేశ్వర దేవస్థానం నూతన కార్యవర్గన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా పాలకుర్ల యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా కొండ శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా బద్దం బాలరాజు, చెదురుపల్లి రాజు, కోశాధికారిగా మొగుదల ప్రదీప్, సహాయ కాదర్శిగా పల్లె ఆనంద్, పందుల కార్తీక్, సభ్యులుగా బొడిగే నరసింహ, సుర్వి వెంకటేష్ ,అంతటి స్వామి, బద్దం నరేష్, చెదురుపల్లి శ్యామ్, పెద్దగోని సత్యనారాయణ ఏకగ్రీవంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## యువత స్వయం శక్తితో ఎదగాలి

-వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య



**చౌటుప్పల్. సెప్టెంబర్ 5. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు ఐతరాజు శివ నూతనంగా ఏర్పాటుచేసిన మద్రాస్ తాటి బెల్లం టి షాపు ప్రారంభ కార్యక్రమంలో శుక్రవారం చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని వారి చేతుల మీదుగా ప్రారంభించారు . ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ యువత స్వయం శక్తితో ఎదగాలని , చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, ధర్మోజి గూడెం గ్రామ స్థానిక సంస్థల ఎన్నికల ఇన్చార్జ్ కొయ్యడ సైదులు గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాచకొండ భార్గవ్, గ్రామ శాఖ అధ్యక్షులు వల్లబోతు నారాయణ ,మాజీ ఎంపిటిసి కాసర్ల శ్రీనివాస్ రెడ్డి,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఊదరి శ్రీనివాస్,మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ కొంతం బుచ్చిరెడ్డి, వీరమల్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ కాలనిలో మట్టి గణపతి నిమర్జనం లో చిన్నారులు



**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 05( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ కాలనీలో పర్యావరణ పరిరక్షణ కాపాడాలని ఆలోచనతో కాలనీలో ఉన్న యువకులు, చిన్నారులు కలిసి గత పది సంవత్సరాల నుండి మట్టి గణపతిని పూజించడం జరుగుతుంది, చివరి రోజు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి నవరాత్రుల పూజలు పురస్కరించుకొని నిమజ్జనానికి బయలుదేరడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడి వచ్చే ఏడాదికి మండల ప్రజలు మట్టి గణపతులను పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# ఊహించని రీతిలో స్టాక్ మార్కెట్లు

### ఓలా ఎలక్ట్రిక్‌లో సాఫ్ట్‌బ్యాంక్ వాటా తగ్గింపు




ద్విచక్ర విద్యుత్ వాహనాల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్‌లో జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ 2.15 శాతం వాటాలను విక్రయించింది. దీంతో సాఫ్ట్‌బ్యాంక్ తన హోల్డింగ్ వాటాను 17.83 శాతం నుంచి 15.68 శాతానికి కుదించుకుందని ఓలా ఎలక్ట్రిక్ గురువారం రెగ్యులేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. జూలై 15 నుండి సెప్టెంబర్ 2 మధ్య జరిగిన వరుస విక్రయాల్లో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్‌లోని కొన్ని ఈక్విటీ షేర్లను విక్రయించిందని పేర్కొంది. 2025 జూన్ 30 నాటికి ఓలా ఎలక్ట్రిక్‌లో సాఫ్ట్ బ్యాంక్ 17.83 కోట్ల షేర్లను కలిగి ఉంది. ఇది 78.65 కోట్ల ఈక్విటీ షేర్లలో 17.83 శాతం వాటాకు సమానం. మార్కెట్ల ముగింపునకు కొద్ది సేపు ముందు ఓలా ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 7 శాతం పతనమై రూ.64.49 వద్ద ముగిశాయి. 350సిసి లోపు ఇంజన్ సామర్థ్యం కలిగిన ద్విచక్ర వాహనాలపై జిఎస్‌టిని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం ఓలా ఎలక్ట్రిక్ షేర్లపై ఒత్తిడిని పెంచింది.

### జీఎస్టీ 2.0 సంస్కరణలు

### వినియోగ ఆధారిత వృద్ధికి చోదక శక్తి



జీఎస్టీ కౌన్సిల్ తాజా రేట్ల తగ్గింపు ప్రకటించిన నేపథ్యంలో ఆ మేరకు పన్ను ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేస్తామని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ గురువారం ప్రకటనలో తెలిపారు. కంపెనీ రిటైల్ విభాగంలోని అన్ని వస్తువులపై వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) రేట్ల తగ్గింపును అమలు చేయనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా కేంద్రం తీసుకున్న జీఎస్టీ 2.0 సంస్కరణలను ముఖేష్ అంబానీ ప్రశమించారు. ఈ చర్యలు వినియోగ ఆధారిత వృద్ధికి చోదక శక్తిగా అభివర్ణించారు. జీఎస్టీ హేతుబద్దీకరణ వల్ల వినియోగదారులకు ఉత్పత్తులు, సేవలు మరింత సరసమైనవిగా మారుతాయని, వ్యాపారాలకు కూడా నిర్వహణలోని సంక్లిష్టతను తగ్గిస్తాయని అన్నారు. పన్ను తగ్గింపు ఫలితంగా రిటైల్ రంగంలో వినియోగాన్ని పెంచేందుకు ఉత్ప్రేరకంగా ఉంటుందని, ముఖ్యంగా ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టేందుకు ఇది కీలకమని అంబానీ తెలిపారు. పన్ను తగ్గింపును వినియోగదారులకు అందించేందుకు రిలయన్స్ రిటైల్ కట్టుబడి ఉందని రిలయన్స్ రిటైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ అన్నారు. ఈ సంస్కరణల ప్రయోజనాలను కస్టమర్లకు పారదర్శకంగా, తక్షణం అందేలా చూస్తామని ఆమె పేర్కొన్నారు.

**16 పైసల నుంచి రూ. 41 కి పెరిగిన షేర్ ధర..**



స్టాక్ మార్కెట్లలో కొన్ని స్టాక్స్ అద్భుతం చేస్తుంటాయి. ఊహించని రీతిలో అనతి కాలంలోనే పెరుగుతూ కాసుల పంట పండిస్తుంటాయి. అయితే ఇక్కడే మనం ఏ స్టాక్ ఎప్పుడు ఎందుకు పెరుగుతుందో అంచనా వేయగలగాలి.ఇందు కోసం.. స్టాక్ మార్కెట్లను జాగ్రత్తగా పరిశీలిస్తుండాలి. ఏదో ఎవరో చెప్పారని గుడ్డిగా నమ్మి ఇన్వెస్ట్ చేయవద్దు. నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం. మరీ ముఖ్యంగా ఆయా కంపెనీల నుంచి వచ్చేటువంటి ప్రకటనలు, ఫలితాలు, పెట్టుబడి వ్యూహాలు ఇలా అన్నింటినీ పరిశీలిస్తూ జాగ్రత్తగా పెట్టుబడి చేయాల్సి ఉంటుంది.ఇంకా స్టాక్ మార్కెట్లలో షార్ట్ టర్మ్ కంటే.. దీర్ఘకాలం మంచి రిటర్న్లు వస్తుంటాయన్న సంగతి తెలిసిందే. ఇక్కడ ఆయా కంపెనీలు ప్రకటించే బోనస్ షేర్లు, స్టాక్ స్ప్లిట్, డివిడెండ్ ఇలా పలు కారణాల వల్ల అదనపు లాభాలు ఉంటాయని చెప్పొచ్చు. అందుకే వీటిని పరిగణనలోకి తీసుకోవడం మంచిది.ఇప్పుడు మనం.. దీర్ఘ కాలంలో ఇన్వెస్టర్ల సంపదను భారీగా పెంచిన ఒక స్టాక్ గురించి తెలుసుకుందాం. అదే హజూర్ మల్టీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్. ఇటీవలి కాలంలో స్టాక్ మార్కెట్లో ఎన్ని ఒడుదొడుకులు ఉన్నప్పటికీ ఈ స్టాక్ రాణించింది. ఈ కంపెనీ ను నమ్ముకొని ఇన్వెస్ట్ చేసి హోల్డ్ చేసిన వారికి కాసుల వర్షం కురిపించింది. ఈ స్టాక్ ధర ఒకప్పుడు పైసల్లో ఉండేది. అక్కడినుంచి భారీగా పెరిగిందని చెప్పొచ్చు. 2015 సెప్టెంబర్ నెలలో.. కేవలం 16 పైసలుగా ఉన్న షేరు ధర.. అక్కడినుంచి ఏటా మల్టీ బ్యాగర్ రిటర్న్లు ఇస్తూ వచ్చింది. ఇప్పుడు దీని ధర రూ. 41.40 వద్ద ఉంది. ఈ క్రమంలో.. అప్పుడు స్టాక్ కొనుగోలు చేసిన వారికి కళ్లుచెదిరే రాబడి ఇచ్చింది. అంటే 10 సంవత్సరాల కిందట ఇందులో ఒకేసారి రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసిన వారికి ఇప్పుడు రూ. 2.59 కోట్లు వచ్చాయి. 2024లో ఈ కంపెనీ 1:10 రేషియోలో బోనస్ షేర్లు ప్రకటించింది. అంటే ఇన్వెస్టర్ దగ్గర 10 ఈక్విటీ షేర్లు ఉంటే.. వారికి దానిపై ఒక్కో షేరు ఉచితంగా లభించేది. దీని వల్ల స్టాక్ ధర తగ్గి మరింత అందుబాటులోకి వచ్చింది. గురువారం సెషన్.. ఈ స్టాక్ ధర స్వల్పంగా పెరిగి రూ. 41.40 వద్ద స్థిరపడింది. గత ఐదేళ్లలో మరింత ఎక్కువగా ఏకంగా 41,130 శాతం పెరిగినా.. ఏడాది నుంచి చూస్తే పడిపోతోంది. ఏడాదిలో ఈ స్టాక్ 17 శాతం తగ్గింది. నెలలో 10 శాతం, 6 నెలల్లో 20 శాతం పతనమైంది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 63.90 కాగా.. కనిష్ఠ ధర రూ. 32 గా ఉంది. ఇక కంపెనీ మార్కెట్ విలువ చూస్తే రూ. 948.78 కోట్లుగా ఉంది.

# వినియోగదార్లకు జీఎస్టీ ప్రయోజనాలు



జీఎస్టీ రేట్ల మార్పు వల్ల కలిగే పూర్తి ప్రయోజనాలను వినియోగదార్లకు కచ్చితంగా బదలాయించాలని పరిశ్రమకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి మంత్రి పీయూశ్ గోయల్ సూచించారు.స్వాతంత్ర్యం వచ్చాక.. అతిపెద్ద సంస్కరణ ఇదేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణల వల్ల దాదాపు అన్ని రంగాల్లోనూ గిరాకీ పెరుగుతుందని, తద్వారా ఆర్థిక వృద్ధికి మద్దతు లభిస్తుందని పేర్కొన్నారు. గురువారమిక్కడ జరిగిన మెడ్‌టెక్ ఎక్స్‌పో, ఐఫెక్స్ 2025, భారత్ న్యూట్రావర్స్ ఎక్స్‌పో 2025లో ఆయన మాట్లాడారు. 'వచ్చే రెండేళ్లలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. 2047 కల్లా ప్రస్తుత 4 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ నుంచి 30 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుతుంది. జీఎస్టీ సంస్కరణలతో రైతు నుంచి ఎమ్ఎస్ఎమ్ఈల వరకు పలు రంగాలపై ప్రభావం కనిపిస్తుంది. దేశంలోని ప్రతీ వినియోగదారుకు లబ్ధి చేకూరుతుంది. 140 కోట్ల మంది పౌరులకు నాణ్యమైన జీవితాన్ని ఈ దీపావళి కానుక ఇస్తుంద'న్నారు. మేం బదిలీ చేస్తాం: దాదాపు ఎఫ్‌ఎమ్‌సీజీ కంపెనీలన్నీ వినియోగదార్లకు ప్రయోజనాన్ని బదిలీ చేస్తామని చెప్పాయి. మదర్‌డెయిరీ కూడా తమ అన్ని ఉత్పత్తులపై జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనాలను బదిలీ చేస్తామని తెలిపింది. తోలు ఉత్పత్తులపై పన్ను రేటును 12% నుంచి 5 శాతానికి తగ్గించిన నేపథ్యంలో, రూ.1,000లోపు ఉత్పత్తులపై ఈ ప్రయోజనాన్ని గడువుకన్నా ముందే వినియోగదారులకు బదిలీ చేస్తున్నట్లు బాటా తెలిపింది. 22 దాకా కొనుగోళ్లు ఆపాలా?: సబ్బుల నుంచి చిన్న కార్ల వరకు సుంకాలు తగ్గిన నేపథ్యంలో.. కారు కానీ టీవీ కానీ కొనాలంటే ఈ నెల 22 వరకూ ఆగాలా? అన్న అనుమానం రావొచ్చు. దీనిపై విశ్లేషకులు ఏమంటున్నారంటే.. 'చట్టప్రకా రం.. 22 నుంచే ఇన్‌వాయిస్‌లలో సవరించిన జీఎస్‌టీ రేటు కనిపిస్తుంది. ఆ తేదీ తర్వాత పంపిణీదార్ల వద్ద ఏదైనా పెండింగ్‌లో ఉన్నా కూడా రిటైలర్లు మాత్రం పాత రేటును ఛార్జీ చేయలేరు. అయితే వినియోగదార్లు, తగ్గిన రేట్లను పరిశీలించుకుంటే మంచిద'ని చెబుతున్నారు. 21 వరకూ ప్రస్తుత రేట్లు ఉంటాయి కాబట్టి.. దాన్ని బట్టి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.

## స్పోర్ట్స్

# కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్..
# ఓపెనర్లుగా బాబర్ ఆజం, జైశ్వాల్

ఆసియాకప్-2025 సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో అబుదాబి వేదికగా అఫ్గానిస్తాన్, హాంకాంగ్ జట్లు తలపడనున్నాయి. ఈ టోర్నీ కోసం భారత జట్టు కూడా యూఏఈ గడ్డపై అడుగు పెట్టింది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత బృందం.. శుక్రవారం సాయంత్రం దుబాయ్‌లోని ఐసీసీ ఆకాడమీలో తొలి ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనుంది. టీమిండియా తమ మొదటి మ్యాచ్‌లో సెప్టెంబర్ 10న దుబాయ్ వేదికగా యూఏఈతో తలపడనుంది. అయితే ఈ ఖండాంతర టోర్నీకి చాలా మంది స్టార్ ప్లేయర్లు దూరమయ్యారు. ముఖ్యంగా భారత జట్టులో కీలక ఆటగాళ్లు యశస్వి జైశ్వాల్, శ్రేయస్ అయ్యర్.. పాక్ జట్టులో మహ్మద్ రిజ్వాన్, బాబర్ ఆజం, నషీంలకు చోటు దక్కకపోవడం అందరని ఆశ్చర్యపరిచింది. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న జైశ్వాల్‌ను సెలక్టర్లు స్టాండ్‌బై జాబితాలో చేర్చారు. అయ్యర్‌ను అయితే పూర్తిగా పరిగణలోకి తీసుకోలేదు. ఇప్పటికి భారత జట్టు సెలక్షన్‌పై విమర్శలు వస్తూనే ఉన్నాయి. అయితే ఆసియాకప్‌కు ఎంపిక కాని ఆటగాళ్లతో కూడిన ప్లేయింగ్ ఎలెవన్ జాబితా ఒకటి సోషల్ మీడియాలో వైరలవుతోంది.




**కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్..**

ఈ ప్లేయింగ్ ఎలెవన్‌లో భారత్ నుంచి యశస్వి జైశ్వాల్, శ్రేయస్ అయ్యర్, వాషింగ్టన్ సుందర్, సిరాజ్‌కు చోటు దక్కగా.. పాక్ నుంచి రిజ్వాన్, బాబర్, కమ్రాన్ గుఆల్, నసీం షాకు అవకాశమిచ్చారు. అదేవిధంగా బంగ్లాదేశ్ నుంచి మెహది హసన్ మిరాజ్, నహిద్ రాణా.. శ్రీలంక నుంచి ఏంజులో మాథ్యూస్ ఈ తుది జట్టులో ఉన్నారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేశారు. ఓపెనర్లుగా జైశ్వాల్, బాబర్ ఆజం ఉండగా.. ఫస్ట్ డౌన్‌లో అయ్యర్‌కు ఛాన్స్ దక్కింది. ఇక మూడో స్థానంలో రిజ్వాన్, నాలుగో స్థానంలో కమ్రాన్ గులాం ఉన్నారు. ఆల్‌రౌండర్ల కోటాలో మాథ్యూస్, మెహది హసన్ మిరాజ్, సుందర్‌లకు అవకాశం దక్కింది. ఫాస్ట్ బౌలర్లగా నసీం షా, సిరాజ్, రాణాలకు చోటు లభించింది.

యశస్వి జైస్వాల్, బాబర్ ఆజం, శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), మహ్మద్ రిజ్వాన్, కమ్రాన్ గులామ్, ఏంజెలో మాథ్యూస్, మెహిదీ హసన్ మిరాజ్, వాషింగ్టన్ సుందర్, నసీమ్ షా, మహ్మద్ సిరాజ్, నహిద్ రాణా

## ఇంగ్లండ్‌కు డేంజర్ బెల్స్..
## వన్డే వరల్డ్ కప్‌కు డైరెక్ట్ ఎంట్రీ కష్టమే!?




ఐసీసీ వన్డే ప్రపంచకప్-2027కు ఇంగ్లండ్ జట్టు నేరుగా అర్హత సాధిస్తుందా? లేదా క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆడుతుందా? అన్న చర్చ ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో నెలకొంది. ఇటీవల కాలంలో ఇంగ్లండ్ జట్టు దారుణ ప్రదర్శన ఇందుకు కారణం. టీ20, టెస్టుల్లో పర్వాలేదన్పి స్తున్న ఇంగ్లీష్ జట్టు.. వన్డేల్లో మాత్రం పూర్తిగా తెలిపోతుంది. 2019 ఛాంపియన్స్ అయిన ఇంగ్లండ్ ప్రస్తుతం వరుస ఓటములతో సతమతమవుతోంది. తాజాగా గురువారం లార్డ్స్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో 5 పరుగుల తేడాతో ఇంగ్లండ్ ఓటమి పాలైంది. దీంతో 2-0 తేడాతో బ్రూక్ సేన సిరీస్‌ను కోల్పోయింది. 1998 తర్వాత సౌతాఫ్రికాపై ఇంగ్లండ్ వన్డే సిరీస్‌ను కోల్పోడం ఇదే తొలిసారి. వన్డే ప్రపంచకప్-2023 తర్వాత ఇప్పటివరకు 21 వన్డేలు ఆడిన ఇంగ్లండ్ కేవలం 7 మాత్రమే గెలిచింది. ఈ ఫలితాలు బట్టి వన్డే ఫార్మాట్‌లో ఇంగ్లండ్ ప్రదర్శన ఎలా ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో కూడా ఇంగ్లండ్ గ్రూపు స్టేజిలోనే ఇంటిముఖం పట్టింది. దీంతో జోస్ బట్లర్ కెప్టెన్సీ తప్పుకొన్నాడు. అతడి స్థానంలో యువ హ్యారీ బ్రూక్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. అయినప్పటికి ఇంగ్లీష్ జట్టు తలరాత మారలేదు. ఇప్పుడు సౌతాఫ్రికాతో సిరీస్‌ను కోల్పోవడంతో 2027 వరల్డ్ కప్ కు నేరుగా అర్హత సాధించే అవకాశాలను ఇంగ్లండ్ సంక్లిష్టం చేసుకుంటుంది. వన్డే ప్రపంచకప్-2027కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ మెగా టోర్నీలో మొత్తం 14 జట్లు పాల్గొంటాయి. వీటిని రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతీ గ్రూపులో ఏడు జట్లు చొప్పున ఉంటాయి. ఇందులో ఎనిమిది జట్లు ర్యాంకింగ్, మరో రెండు జట్లు ఆతిథ్య హోదాలో అర్హత సాధిస్తాయి. మరో నాలుగు జట్లు క్వాలిఫయర్ రౌండ్స్ నుంచి ప్రధాన టోర్నీలో అడుగుపెడతాయి. ఆతిథ్య హోదాలో దక్షిణాఫ్రికా, జింబాబ్వే ఆటోమేటిక్ అర్హత సాధిస్తాయి. అయితే నమీబియా ఆతిథ్యమిస్తున్నప్పటికి ఇంకా ఐసీసీ సభ్య దేశం కాకపోవడంతో క్వాలిఫయర్స్ ఆడాల్సిందే.

**ఆఖరి స్థానంలో ఇంగ్లండ్..**

ఇక ప్రస్తుతానికి ఐసీసీ వన్డే ర్యాకింగ్స్‌లో టాప్-8లో భారత్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, దక్షిణాఫ్రికా, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, ఇంగ్లండ్ ఉన్నాయి. సౌతాఫ్రికా ఎలాగో నేరుగా అర్హత సాధిస్తుంది కాబట్టి ర్యాంకింగ్‌తో సంబంధం లేదు. అయితే ఇంగ్లండ్ మాత్రం 86 రేటియింగ్ పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉంది. ఇంగ్లండ్ తర్వాతి స్థానంలో వెస్టిండీస్(80), బంగ్లాదేశ్(77) ఉంది. ఇంగ్లండ్, విండీస్, బంగ్లాదేశ్‌కు మధ్య పెద్దగా రేటింగ్ పాయింట్లు తేడా లేవు. ఇప్పటినుంచి అయినా ఇంగ్లండ్ వన్డేల్లో మెరుగైన ప్రదర్శన చేయకపోతే పదో స్థానానికి పడిపోతుంది. దీంతో ఇంగ్లీష్ జట్టు క్వాలిఫయర్స్ ఆడాల్సి వుంటుంది. ఒకవేళ రాబోయో సిరీస్‌లలో విజయాలు సాధిస్తే ఇంగ్లండ్ నేరుగా అర్హత సాధిస్తుంది. ప్రపంచకప్‌కు ముందు ఇంగ్లండ్ న్యూజిలాండ్, శ్రీలంక, భారత్‌తో సిరీస్‌లో ఆడనున్నారు. శ్రీలంకతో రెండు సార్లు వన్డే సిరీస్‌లో ఇంగ్లండ్ తలపడనుంది.

## ఏడో వరల్డ్ కప్‌పై గురి..
## ఆల్‌రౌండర్లతో వచ్చేస్తున్న ఆస్ట్రేలియా..!



ఐసీసీ టోర్నీల్లో తిరుగులేని ఆస్ట్రేలియా మరోసారి వన్డే వరల్డ్ కప్ లక్ష్యంగా సిద్ధమవుతోంది. ఇప్పటికే ఏడుసార్లు విజేతగా నిలిచిన ఆసీస్ పటిష్టమైన స్క్వాడ్‌తో భారత్‌కు వస్తోంది. అలీసా హేలీ కెప్టెన్‌గా శుక్రవారం సెలెక్టర్లు పదిహేను మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. ఎప్పటిలానే ఇప్పుడు కూడా మ్యాచ్ విన్నర్లు అయిన ఆల్‌రౌండర్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. గాయం నుంచి కోలుకున్న లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్నర్ సోఫీ మొలినెక్స్ డార్సీ బ్రౌన్, జార్జియా వరేహమ్‌లను వరల్డ్ కప్ స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. 'వరల్డ్ కప్ స్క్వాడ్ ఎంపికలో మేము అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకున్నాం. భారత్, శ్రీలంకలో స్పిన్నర్లు కీలక పాత్ర పోషిస్తారని తెలుసు. అందుకే.. సోఫీ మొలినెక్స్‌కు స్క్వాడ్‌లో చోటిచ్చాం. గాయం నుంచి కోలుకుంటున్న ఆమె వరల్డ్ కప్ వరకూ ఫిట్‌నెస్ సాధిస్తుందనే నమ్మకం మాకుంది అని ఆస్ట్రేలియా జాతీయ సెలెక్టర్ షాన్ ఫ్లెగ్లర్ వెల్లడించాడు. ప్రపంచ కప్‌లో అధిపత్యం చెలాయించే ఆసీస్ ఈసారి కూడా మెగా టోర్నీకి పక్కా ప్లాన్‌తో వస్తోంది. టాపార్డర్‌లో దంచికొట్టేందుకు అలీసా హేలీ, డార్సీ బ్రౌన్, ఫొబే లిచ్‌ఫీల్డ్ ఉన్నారు. తహ్లియా మెక్‌గ్రాత్, జార్జియా వరేహం, ఎలీసా పెర్రీ, అషే గార్డ్‌నర్ ఆల్‌రౌండర్లుగా ఇరగదీయడం ఖాయం. మేఘన్ షట్, సథర్‌లాండ్, జార్జియా వొల్‌తో కూడిన పేస్ దళం కూడా పటిష్టంగానే ఉంది. ఆస్ట్రేలియా స్క్వాడ్ : అలీసా హేలీ(కెప్టెన్), తహ్లియా మెక్‌గ్రాత్(వైస్ కెప్టెన్), డార్సీ బ్రౌన్, అషే గార్డ్‌నర్, కిమ్ గార్త్, గ్రేస్ హ్యారిస్, అలనా కింగ్, ఫొబే లిచ్‌ఫీల్డ్, సోఫీ మొలినెక్స్, బేత్ మూనీ, ఎలీసా పెర్రీ, మేగన్ షట్, అనాబెల్ సథర్‌లాండ్, జార్జియా వొల్, జార్జియా వరేహమ్. వరల్డ్ కప్ ముందు భారత జట్టుతో ఆస్ట్రేలియా వన్డే సిరీస్ ఆడనుంది. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం వరల్డ్ కప్ స్క్వాడ్‌కు అదనంగా మరో ఇద్దరిని తీసుకున్నారు. ఆల్‌రౌండర్ చార్లీ నాట్, వికెట్ కీపర్ %-% బ్యాటర్ అయిన నికొలే ఫాల్టమ్‌ను ఎంపిక చేశారు. ఈ ఇద్దరూ వరల్డ్ కప్ టోర్నీ ప్రారంభం కాగానే స్వదేశానికి బయల్దేరుతారు. మెగా టోర్నీ లీగ్ దశలో అక్టోబర్ 1న న్యూజిలాండ్‌తో ఆసీస్ తలపడనుంది. ఇప్పటివరకూ ఆస్ట్రేలియా 1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022లో వలర్డ్ కప్ ట్రోఫీని ముద్దాడింది.

# ఓటీటీలో హారర్, కామెడీ సినిమా.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?




టాలీవుడ్ ప్రముఖ కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన సినిమా 'బకాసుర రెస్టారెంట్'.. ఆగష్టు 8న థియేటర్‌లోకి వచ్చిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలోకి రానుంది. ఈమేరకు అధికారికంగా ప్రకటన కూడా వచ్చేసింది. ఎస్‌జే శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటించాడు. కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్ ముఖ్యపాత్రల్లో నటించారు. 'బకాసుర రెస్టారెంట్' హారర్, థ్రిల్లర్, మైథాలజీ కాన్సెప్ట్‌తో స్టోరీ ఉంటుంది. అయితే, ప్రేక్షకులకు పెద్దగా కనెక్ట్ కాలేదు. కానీ, ఓటీటీ ప్రేక్షకులకు నచ్చే ఛాన్స్ ఉంది. సెప్టెంబర్ 12న 'సన్‌నెక్స్ట్' (%బాబఅ చీఠు%)లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానున్నట్లు ప్రకటన వచ్చేసింది. మన స్నేహితుడు అనివార్య కారణాల వల్ల మనకు దూరమైతే ఎంతటి బాధ ఉంటుందో ఈ సినిమాలో చూపించారు. ఆపై కామెడీ ఎటూ ఉండటంతో ఓటీటీ ప్రేక్షకులకు మంచి కాలక్షేపాన్ని ఇచ్చే సినిమా అని చెప్పవచ్చు. పరమేశ్వర్(ప్రవీణ్) ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నలుగురు స్నేహితులతో కలిసి ఓ రూమ్‌లో ఉంటూ ఇష్టం లేకపోయినా డబ్బుల కోసం ఆ జాబ్ చేస్తుంటాడు. ఎప్పటికైనా ఓ రెస్టారెంట్ పెట్టాలనేది ఆయన కోరిక. ఓ సారి తన కోరికనే స్నేహితులతో పంచుకోగ.. డబ్బుల కోసం యూట్యూబ్ లో ఘోస్ట్ వీడియోలు చేద్దామని సలహా ఇస్తారు. అనుకున్నట్లే మొదటి వీడియో బాగా వైరల్ అవుతుంది. రెండో వీడియో కోసం ఓ హెూస్ట్ హౌస్‌కి వెళ్తారు. అక్కడ వీరికి ఒక తాంత్రిక పుస్తకం దొరుకుతుంది. దాన్ని వాడి డబ్బులు సంపాదించుకోవాలనుకుంటారు. అందులో రాసి ఉన్నట్లుగా మంత్ర పూజ చేయగా.. నిమ్మకాయలోకి 200 ఏళ్ల క్రితం నాటి ఆత్మ వస్తుంది. ఆ ఆత్మకు ఆకలి ఎక్కువ. ఇంట్లో ఉన్న ఫుడ్ అంతా తినేస్తుంది. ఆ నిమ్మకాయలో ఉన్న ఆత్మను కట్టడి చేసేందుకు ప్రయత్నించగా.. పరమేశ్వర్ రూమ్‌లోకి వచ్చిన అంజిబాబు(ఫణి) శరీరంలోకి వెళ్తుంది. అంజిబాబు శరీరాన్ని ఆవహించిన ఆత్మను పొగొట్టేందుకు పరమేశ్వర్ గ్యాంగ్ చేసిన ప్రయత్నాలు ఏంటి? బక్క సూరి(వైవా హర్ష) ఎవరు? రెస్టారెంట్ పెట్టాలన్న పరమేశ్వర్ కోరిక నెరవేరిందా? లేదా? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# భగత్ సింగ్ వేగం బాగుందయ్యా




ఎప్పుడు ఏ సమయంలో పవన్ కళ్యాణ్ బిజీ అవుతారో తెలియదు కాబట్టి తనకిచ్చిన బంగారం లాంటి డేట్లను వృథా చేయకుండా దర్శకుడు హరీష్ శంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ ని పరుగులు పెట్టిస్తున్నారు. ఈ ఏడాది విడుదల లేకపోయినా పోస్ట్ ప్రొడక్షన్ కి ఎక్కువ సమయం కేటాయించి ప్రమోషన్ల కోసం ప్రత్యేక ప్లానింగ్ లో ఉన్నట్టు ఇన్ సైడ్ టాక్. ఇటీవలే ఒక పాట షూట్ పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మొన్న పవన్ పుట్టినరోజుకి విడుదల చేసింది దాని స్టిల్లే. నిజానికి స్టెప్పుతో కూడిన చిన్న వీడియోని వదలాలనే ఆలోచన వచ్చిందట గాని ఓజి ఫీవర్ లో ఉన్న ఫ్యాన్స్ ని డిస్టర్బ్ చేయడం ఇష్టం లేక పోస్టర్ తో సరిపెట్టారు.ఇప్పుడు మరో సాంగ్ కోసం రంగం సిద్ధమైపోయింది. దినేష్ మాస్టర్ కొరియోగ్రఫీలో శనివారం నుంచి దీని షూట్ మొదలుపెట్టబోతున్నట్టు సమాచారం. ఇందులో కూడా క్రేజీ నృత్య భంగిమలు ఉంటాయని తెలిసింది. హరీష్ శంకర్ ముందు పలు సవాళ్లున్నాయి. తేరి రీమేకనే ప్రచారం ఉస్తాద్ భగత్ సింగ్ హైప్ మీద తీవ్ర ప్రభావం చూపించింది. ఇప్పుడిది ఒరిజినల్ కథని ఆయన చెబుతున్నారు కానీ తెరమీద చూశాక తప్ప అభిమానులు నమ్మలేని పరిస్థితి. ఇదలా ఉంచితే హైప్ లో పీక్స్ ని చూసిన ఓజి తర్వాత వస్తున్న సినిమాని హరీష్ శంకర్ డైరెక్ట్ చేశారు. సో ఆ హిట్టుని హీటుని అదే రీతిలో కొనసాగించాలి. అందుకే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉండేలా స్క్రిప్ట్ లో పలు మార్పులు చేసుకున్న హరీష్ శంకర్ మీద గబ్బర్ సింగ్ రేంజ్ విజయం ఇవ్వాల్సిన అతి పెద్ద బాధ్యత నెత్తి మీద ఉంది. ఇవి కాకుండా మిస్టర్ బచ్చన్ చేసిన గాయం పెద్దదే. రవితేజకో మర్చిపోలేని హిట్టు పడుతుందనుకుంటే పెద్ద డిజాస్టర్ దక్కింది.



# హైప్ పెంచుతున్న హీరోయిన్ పోస్ట్

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ చిత్ర శుక్ల 'దక్ష' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మెడికల్ అండ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమాలో మంచు లక్ష్మీ ప్రసన్న, సిద్ధిఖీ, కలెక్షన్ కింగ్, పద్మశ్రీ అవార్డు గ్రహిత మోహన్ బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. డైమండ్ రత్నబాబు అందించిన కథతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వంశీ కృష్ణ మల్లా దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విశ్వంత్, మహేష్, విరేన్, తంబి దొరై, సముద్రఖని, కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని మంచు ఎంటర్టైన్మెంట్స్, శ్రీ లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అచ్చు రాజమణి సంగీతం అందిస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబర్ 12న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ మూవీ మేకర్స్ హీరోయిన్ చిత్ర శుక్ల పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను షేర్ చేశారు. ఇందులో ఆమె 'మిథిలా' పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించారు. ఇక ఈ విషయాన్ని తెలుపుతూ చిత్ర ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. "మిథిలా ముఖం అమాయకంగా కనిపిస్తుంది. కానీ మీరు తెలుసు అనుకున్న.. ప్రతి దాన్ని బద్దలు కొట్టే రహస్యాలతో ఆమె పాత్ర ఉండబోతుంది. ప్రపంచంలో సున్నితమైన స్వరంతో ఉంటుంది. కానీ ఆమె సైలెన్స్‌ను బలహీనతగా పొరపాటు పడకండి. నియమాలను తిరగరాయడానికి 'దక్ష' మీ ముందుకు వస్తోంది" అనే క్యాప్షన్ జత చేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ ప్రేక్షకుల్లో హైప్ పెంచుతోంది.

# ఓనం స్పెషల్.. దిల్ రాజు భార్య చీరకట్టులో మెరిసిపోయిందిగా..!

ఈ ఏడాది సెప్టెంబర్ 5న మూడు పండుగలు ఒకేసారి రాగా, దేశవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. నేడు ఉపాధ్యాయ దినోత్సవం, మిలాద్-ఉన్-నబి, కేరళ రాష్ట్రంలో ఓనం.. ఈ మూడు వేడుకలు ఒకే రోజు రావడం విశేషం. ఇందులో ఓనం పండుగ కేరళలో చాలా ఫేమస్. కేరళలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఈ పండుగని మలయాళీలు చాలా సంతోషంగా జరుపుకుంటారు.అయితే ఈ పండుగ సందర్భంగా ప్రముఖ నిర్మాత దిల్ రాజు భార్య తేజస్వినీ ఎంతో అందంగా ముస్తాబై సోషల్ మీడియాలో మెరిసింది. కేరళ ట్రెడిషనల్ వైట్ అండ్ గోల్డ్ చీరకట్టులో తేజస్వినీ ఆకట్టుకుంది. తన పండుగ లుక్ ఫొటోలు సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ, అందరికీ "ఓనం శుభాకాంక్షలు" తెలిపింది. ఓనం పండుగను పురస్కరించుకుని పలువురు సినీ ప్రముఖులు కూడా బ్యూటీఫుల్ మూమెంట్స్ ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటున్నారు. తేజస్విని ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. "అందం అంటే ఇదే", "సింపుల్ అండ్ ఎలిగెంట్", "మలయాళ అమ్మాయి అనిపిస్తోంది" అంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. గతంతో పోలిస్తే తేజస్వినీ ఇప్పుడు సోషల్ మీడియాలో మరింత యాక్టివ్‌గా మారింది. తన పర్సనల్ మరియు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన ఫొటోలు, వీడియోలను తరచూ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటోంది. ఓనం అంటే కేవలం పండుగ మాత్రమే కాదు, అది కేరళ సంస్కృతి, సంప్రదాయం.ఇది మహాబలి చక్రవర్తి ఆగమనాన్ని స్వాగతించే సందర్భం. సంప్రదాయ వస్త్రధారణ, పూకలం (పూల ముగ్గులు), సద్య (విందు భోజనం)లతో మలయాళీలు ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు. ఈ విధంగా, దిల్ రాజు భార్య తేజస్వినీ తన ట్రెడిషనల్ లుక్‌తో ఓనం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గతంలో ఎక్కువగా భర్త దిల్ రాజు, తనయుడు అన్వి రెడ్డితో కలిసి దిగిన ఫోటోలు లేదా వీడియోలు షేర్ చేసేది తేజస్విని. కానీ ఇప్పుడు ఆవిడ పర్సనల్ ఫోటోలు ఎక్కువగా షేర్ చేస్తున్నారు.అవి తెగ వైరల్ అవుతున్నాయి.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.